RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:206 ఆదివారం 30 ఆగస్టు 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098



# ప్రాణహిత-చేవెళ్లకు మళ్లీ జీవం

- తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యం
- సెప్టెంబర్ 1న కేంద్రం ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర చర్చలు
- 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదన
- గ్రావిటీ ద్వారా సుమారు 80 టీఎంసీల తరలింపునకు అవకాశం
- సాంకేతిక, చట్టపరమైన అంశాలపై అధికారుల సమగ్ర సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 29:**

ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం సాధించడమే ప్రధాన లక్ష్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో సచివాలయంలో ఉన్నతస్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

**గ్రావిటీతో నీటి తరలింపు**

తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను సహజసిద్ధంగా గ్రావిటీ ద్వారా సుందిళ్ల

మిగతా 3వ పేజీలో..



## ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం బాధ్యత

2

- సీఎం రేవంత్ రెడ్డితో కేకే కమిటీ సుదీర్ఘ సమావేశం
- ఉద్యమకారుల గుర్తింపును వేగవంతం చేయండి : సీఎం ఆదేశాలు
- ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టీకరణ

## అర్హులైన ఏ ఓటరు పేరు తొలగకూడదు

- ఎన్నికల ప్రధాన అధికారికి ముఖ్యమంత్రి లేఖ



**హైదరాబాద్, ఆగస్టు 29 :**

తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)

మిగతా 2వ పేజీలో..



## మారిషస్‌లో తెలుగుకు తెలంగాణ అండ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంతో మారిషస్ బృందం భేటీ

2

## మెట్రో స్టేషన్లలో ఆన్‌లైన్ సమస్యలు

- ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు తెరుక ప్రయాణికుల ఇబ్బంది
- అంతా సర్దుకుందంటున్న మెట్రో అధికారులు



**హైదరాబాద్, ఆగస్ట్ 29 :**

హైదరాబాద్ మెట్రో రైలు సేవల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో మెట్రో అధికారులు స్పందించారు. ప్రస్తుతం నగరంలో

మిగతా 2వ పేజీలో..



## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం: జూపల్లి

- శామీర్‌పేట్, సోమశిలలో కొత్త గోల్ఫ్ కోర్సుల ఏర్పాటు
- పీపీపీ విధానంలో ప్రపంచస్థాయి వసతుల అభివృద్ధి
- 1 నుంచి తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టోర్నీ
- ప్రచారకర్తగా దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ సేవలు

2



## మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూసింది కాంగ్రెస్సే

- మోదీ సంక్షేమంతోనే నిజమైన సాధికారత
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

2



2

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై దానం ఆగ్రహం

## తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు రావాలి

- ప్రజలను తిప్పించుకుంటే సహించేది లేదు
- మంత్రి పొంగులేటి హెచ్చరిక



**హైదరాబాద్/ సూర్యాపేట, ఆగస్టు 29 :**

తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో స్పష్టమైన మార్పు రావాలని, భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకునే విధానాన్ని ఎంతమాత్రం సహించేది లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల

మిగతా 3వ పేజీలో..



## ములుగు హాస్పిటల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేక వ్యాధులపై పరిశోధన కేంద్రం
- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్‌కు మంత్రి సీతక్క విజ్ఞప్తి

3

## రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం

- సమగ్ర విత్తన చట్టానికి సిద్ధమవుతున్న ప్రభుత్వం
- కేంద్రం జాప్యం చేసినా కొత్త చట్టం తెస్తామన్న మంత్రి తుమ్మల



2



3

## సాంకేతికత ఆవిష్కరణలే పోలీసింగ్‌కు దిక్సూచి

- క్లస్టర్-3లో నల్గొండ.. క్లస్టర్-4లో సూర్యాపేట ప్రథమం

## రైతు భూ హక్కులకు పూర్తి రక్షణే లక్ష్యం

- ఏడాదిలో రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమికి సమగ్ర సర్వే
- వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు
- భూ భారతి ద్వారా తాతల కాలం నాటి భూ సమస్యలకు పరిష్కారం
- నూతన్‌కల్‌లో 1,061 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- రెవెన్యూ మంత్రి పొంగులేటి



3

## రీల్స్ కోసం కాదు.. రియల్ లైఫ్ కోసం ఆడండి

- క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి
- మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులు

3



# అర్హులైన ఏ ఓటరు పేరు తొలగకూడదు

**మొదటిపేజీ తరువాయి**

ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ఆయన లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతోపాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికిమించి నమోదైన ఓటర్లుగా (ఏఎస్ డీడీ) గుర్తించినట్లు ముఖ్యమంత్రి ఈసీ గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకర మని పేర్కొన్నారు. మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానించలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడోవంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు.

# ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం బాధ్యత

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ ప్రక్రియను ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీవో నెం. 679 ద్వారా ఏర్పడిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు (కేకే) నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో శనివారం కలిసింది. ఈ కీలక సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వేదికగా 13,000 మందికి పైగా ఉద్యమకారులు, వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులతో నిర్వహించిన విస్తృతస్థాయి సంప్రదింపుల వివరాలను, ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా నివేదికను కమిటీ ముఖ్యమంత్రికి అందజేసింది.

**వేగంగా పరిపాలనా సహకారం**

కమిటీ నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి ఉద్యమకారుల రుణాన్ని తీర్చుకోవడం ప్రజా ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యమకారుల దరఖాస్తుల స్వీకరణకు డిజిటల్ పోర్టల్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా సమన్వయం చేసుకుంటూ పరిపాలనాపరమైన పూర్తి సహకారాన్ని కమిటీకి అందించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో 679 జారీ చేయడమే కాక ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లైన 250 గజాల నివాస స్థలాలు, ఆసరా పెన్షన్, హెల్త్ కార్డ్స్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, ఉద్యోగులకు గౌరవ గుర్తింపు మొదలైన అంశాలపై సానుకూలంగా స్పందించినందుకు కమిటీ చైర్మన్ కేకే, కోదండరామ్, సభ్యులు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఎంపీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి. శషాద్రి, కార్యదర్శులు ఎస్.శ్రీధర్, చంద్రశేఖర్ రెడ్డి, వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి జూపల్లి

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గోల్కొండ గోల్ఫ్ క్లబ్‌లో 'తెలంగాణ గోల్కొండ మాస్టర్స్' 12వ ఎడిషన్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు శామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో ఒక గోల్ఫ్ కోర్సును, కృష్ణా నది తీరంలోని సోమశిల (అమ్రాబాద్ టైగర్ రిజర్వ్) ప్రాంతంలో మరొక ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సును పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్ర పర్యాటక, క్రీడల ప్రచారం కోసం భారత క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ సేవలను ఉపయోగించుకోనున్నట్లు వెల్లడించారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (డీపీ వరల్డ్ పీజీటీఐ), హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి ఈవెంట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తోంది. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నీ నిర్వహించడం రాష్ట్ర చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కిందన్నారు. హైదరాబాద్ నగరానికే తెలంగాణ పర్యాటకం పరిమితం కాదని.. రాష్ట్రంలోని సరస్సులు, అడవులు, గోదావరి, కృష్ణా నదులు, రాజభవనాలు, కోటలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు.

**సెప్టెంబరు 1 నుంచి టోర్నీ – రూ.కోటి ప్రైజ్‌మనీ**

డీపీ వరల్డ్ పీజీటీఐ, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా తెలంగాణ టూరిజం సహకారంతో ఈ టోర్నీని నిర్వహిస్తున్నాయి. సెప్టెంబరు 1 నుండి 4వ తేదీ వరకు నిర్వహిస్తారు. దేశవిదేశాల నుంచి 132 మంది ప్రముఖ గోల్ఫర్లు పాల్గొంటారు ప్రైజ్‌మనీ రూ. కోటి ఉంటుంది. డీపీ వరల్డ్ పీజీటీఐ అధ్యక్షుడు కపిల్‌దేవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ సహకారం అభినందనీయమని, ఈ పోటీల ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ టూరిజంలో ప్రత్యేక గుర్తింపు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కెప్టెన్ జస్విందర్ సింగ్ బిర్ది మాట్లాడుతూ 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ గోల్ఫర్ల ఆటను హెచ్‌జీఏ సభ్యులు వీక్షించే అవకాశం లభిస్తుందని తెలిపారు. లైవ్ టెలికాస్ట్ ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అవుతుందన్నారు. కార్యక్రమంలో డీపీ వరల్డ్ పీజీటీఐ సీఈఓ అమన్‌దీప్ జోల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన అంతర్జాతీయ గోల్ఫర్ స్టెపాన్ డానెక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొటోకాల్ ఉల్లంఘనపై దానం ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :**

ఖైరతాబాద్ డబుల్ బెడ్ రూంల లక్కీ డ్రాలో ప్రొటోకాల్ రగడ నెలకొంది. ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగేందర్ ఈ కార్యక్రమంలో పాల్గొని డ్రా ద్వారా లబ్ధిదాలను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఎమ్మెల్యే రాకముందే అధికారులు లక్కీ డ్రాను ప్రారంభించారు. దీనిపై దానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని అధికారులపై సీరియస్ అయ్యారు. ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన దానం.. కార్యక్రమం మధ్యలోనే అలిగి వెళ్లిపోయారు. కాగా, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లక్కీ డ్రా హైదరాబాద్ క్యూర్ పరిధిలో కొనసాగుతోంది. కోర్ అర్బన్ ప్రాంతంలోని తొలి విడతలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ ఇళ్ల కేటాయింపు పక్రియ నాలుగు రోజులపాటు పారదర్శకంగా జరగనుంది.

# రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

రాష్ట్ర రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకురావడంలో ఇక ఎలాంటి జాప్యం ఉండకూడదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వచ్చే పంటకాలానికైనా రైతులకు మేలు జరిగేలా విత్తన చట్టాన్ని అమల్లోకి తెచ్చే తదుపరి చర్యలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో విత్తన చట్టం 2025పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో విత్తన ఉత్పత్తి, నాణ్యత, నియంత్రణ, విక్రయాలు, ధరల నియంత్రణతో పాటు విత్తన ఉత్పత్తి రైతుల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సమగ్ర విత్తన చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం గతంలోనే ప్రత్యేక విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఈ కమిటీ రైతులు, విత్తన కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లు, డీలర్లు, పంపిణీదారులు, వ్యవసాయ అధికారులతో సంప్రదింపులు నిర్వహించి, విత్తన రంగానికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కమిటీ సూచనల మేరకు విత్తన చట్టాన్ని తీసుకురావడానికి సిద్ధమవుతున్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వం 'విత్తన చట్టం 2025' పేరుతో ముసాయిదా బిల్లును రూపొందించిందని పేర్కొన్నారు. కేంద్ర ముసాయిదా బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాలను తెలియజేస్తూ కొన్ని అంశాలను సమ్మతించడంతోపాటు మరికొన్ని అంశాలపై అభ్యంతరాలు, సూచనలు తెలియజేస్తూ కేంద్రానికి పంపించిందని తెలిపారు.

**ప్రపంచపటాలు పరిశీలించండి**

కేంద్రం నిర్ణయంతో సంబంధం లేకుండా ముందుకు

కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం తన అభిప్రాయాలను పంపి నెలలు గడిచినా ఆశించిన స్థాయిలో ముందడుగు పడలేదని మంత్రి తుమ్మల అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టాన్ని త్వరగా తీసుకురావాలని పలుమార్లు లేఖలు రాసినప్పటికీ కేంద్రం జాప్యం చేస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణ దేశంలోనే సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన నేపథ్యంలో విత్తన రంగానికి సమగ్ర చట్టపరమైన వ్యవస్థ ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టాన్ని తీసుకొచ్చినా, తీసుకురాకపోయినా రైతుల ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గదని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం అనుమతి లభించని పక్షంలో, రాష్ట్ర విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీ సూచనల మేరకు స్వయంగా విత్తన బిల్లును రూపొందించి శాసనసభలో ప్రవేశపెట్టి అమల్లోకి తీసుకొస్తామని తెలిపారు.

**నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు – పరిహారానికి చట్టబద్ధత**

రైతులకు చట్టపరమైన రక్షణ: రైతు-విత్తన కంపెనీ మధ్య నేరుగా పారదర్శక ఒప్పంద వ్యవస్థ ఉండేలా చూడాలని, మధ్యవర్తుల పాత్రను నియంత్రించాలని సూచించారు.

న్యాయమైన ధర & బీమా: విత్తన ఉత్పత్తి రైతులకు న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పంట బీమా కల్పించాలని ఆదేశించారు.

సత్వర నష్టపరిహారం: నకిలీ, నాసిరకం విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు సత్వరమే పరిహారం అందేలా చట్టబద్ధమైన వ్యవస్థను, సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగంను ఏర్పాటు చేయాలన్నారు.

కఠిన నియంత్రణ వ్యవస్థ: విత్తన ఉత్పత్తి ప్రాంతాలను క్రాప్ బుకింగ్, Seed Traceability వ్యవస్థతో అనుసంధానం చేయాలని, మండల స్థాయిలో సీడ్ బ్యాంకులు, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులను ప్రోత్సహిస్తూ సంప్రదాయ విత్తన రకాలను పరిరక్షించాలని ఆదేశించారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం, నకిలీ విత్తనాలను అరికట్టడం, పంట నష్టానికి పరిహారం కల్పించడం, విత్తన రంగంలో పారదర్శకత పెంపొందించడమే ఈ సమగ్ర విత్తన చట్టం ప్రధాన లక్ష్యాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# ములుగు హాస్పిటల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

**హైదరాబాద్, ఆగస్టు 29 :**



ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ అభివృద్ధికి తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) కోరారు. వైద్య ,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో సచివాలయంలో ఆమె శనివారం భేటీ అయ్యారు. ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, వైద్య సిబ్బంది నియామకం, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు తదితర అంశాలపై మంత్రి సీతక్క వినతిపత్రం అందజేశారు.

**అత్యవసర నిధులు, సిబ్బంది నియామకం**

హాస్పిటల్ లో డ్రైనేజీ, పారిశుధ్య పనుల కోసం అత్యవసరంగా రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని మంత్రి కోరారు. అలాగే రోగుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఓపీ (అవుట్ పేషెంట్) గదుల నిర్మాణం కోసం రూ.2 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హాస్పిటల్ నిర్వహణ, సేవల మెరుగుదలకు 50 మంది వర్కర్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు రూ.1.20 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. 132 టెక్నికల్ పోస్టులకు ప్రస్తుతం కేవలం 14 మంది మాత్రమే పనిచేస్తున్నారని, మిగిలిన పోస్టులను భర్తీ చేసేందుకు అత్యవసరంగా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**అధునాతన వైద్య సదుపాయాల కల్పన**

క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగుల సౌకర్యార్థం అత్యవసరంగా ర్యాంప్ ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే 5 నుంచి 10 పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కంటి సంబంధిత శస్త్రచికిత్సల కోసం క్రిటికల్ కేర్ బ్లాక్‌లో ఆధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావాలంటే ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

**ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక పరిశోధన కేంద్రం**

ములుగు వంటి ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హీమోఫీలియా వంటి వ్యాధులు అధికంగా కనిపిస్తున్న నేపథ్యంలో ఈ వ్యాధులపై ప్రత్యేక అధ్యయనం, నిర్ధారణ, చికిత్స కోసం ములుగు జిల్లాలో ఒక ప్రత్యేక పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో కనిపించే ప్రత్యేక ఆరోగ్య సమస్యలపై శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి, బాధితులకు మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ పరిశోధన కేంద్రం ద్వారా ఆదివాసీ గిరిజనుల ఆరోగ్య పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసి, దీర్ఘకాలిక వైద్య కార్యాచరణ రూపొందించవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలు, ముఖ్యంగా మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ని అన్ని విధాలుగా బలోపేతం చేయాలని కూడా సీతక్క కోరారు. తన వినతిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సంబంధిత అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచిస్తామని హామీ ఇచ్చారన్నారు.



# మెట్రో స్టేషన్ల లో ఆన్‌లైన్ సమస్యలు

**మొదటిపేజీ తరువాయి**

మెట్రో రైలు సేవలు సాఫీగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. మెట్రో స్టేషన్లలోనూ ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేవన్నారు. ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెట్రో సేవలు సాఫీగానే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ లో ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు ఆలస్యంగా ఓపెన్ అయ్యాయని అధికారులు తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ కారణంగానే గేట్లు తెరవడంలో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. ప్రస్తుతం ఎల్బీనగర్ సహా ఇతర అన్ని మెట్రో స్టేషన్లలో సేవలు సాధారణ స్థితిలో కొనసాగుతున్నాయని ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు వెల్లడించారు. అయితే ఆన్‌లైన్‌లో ముందుగానే టికెట్లు కొనుగోలు చేసుకున్న ప్రయాణికులు ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద స్కానింగ్ సమస్యలు తలెత్తడంతో క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మెట్రో స్టేషన్ సిబ్బంది కూడా చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ టికెట్ తీసుకున్నాకా గేట్ల వద్ద వేచి ఉండాల్సి రావడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తరచుగా ఆన్‌లైన్ టికెటింగ్, స్కానింగ్ సేవల్లో అంతరాయాలు ఏర్పడుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# మారిషస్‌లో తెలుగుకు తెలంగాణ అండ

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

మారిషస్‌లో తెలుగు భాష, సంస్కృతి, పురాణ ఇతిహాసాలను ప్రమోట్ చేసేందుకు ఆ దేశానికి అన్ని విధాలా సహకరిస్తామని మారిషస్ ప్రతినిధులుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. మహాత్మా జ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మనా రాజ్ పెంటియా బృందం ఉప ముఖ్యమంత్రితో భేటీ శనివారం అయింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వారితో మాట్లాడుతూ తెలంగాణమారిషస్ మధ్య సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలున్నాయని అన్నారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రజల మధ్య స్నేహపూర్వ సంబంధాలున్నామని గుర్తుచేశారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల ద్వారా తెలంగాణకు మారిషస్‌తో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. మారిషస్‌లోని తెలుగు సమాజం అక్కడి గొప్ప బహుళ సాంస్కృతిక సమాజంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉందన్నారు. మారిషస్ ప్రభుత్వం చేపడుతున్న రామ భజన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క చెప్పారు. విద్య, సాంస్కృతిక పరిశోధన, కళలు, భాష, సాంస్కృతిక అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. మారిషస్‌లోని తెలుగు కల్చరల్ సెంటర్‌లో లక్షలాదిమంది తెలుగు ప్రవాసులు తమ సంస్కృతి, సంప్రదాయాలను, భాష పరిరక్షణ చేస్తున్నారని మారిషస్ మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజం పట్ల తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు, తెలుగు భాష, సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు చేస్తున్న కృషికి వారు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.



# మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూసింది కాంగ్రెస్సే

**మహబూబ్‌నగర్, ఆగస్టు 29 :**

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ దేశంలో విభజన రాజకీయాలు చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీ డి.కె.అరుణతోపాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ... దేశంలో అత్యధిక మత ఘర్షణలు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' నినాదంతో సమన్యాయ పాలన అందిస్తోందన్నారు. కేంద్ర పథకాలు ముద్రా, జన్ ధన్, ఉజ్వల, ఉడాన్ వంటి కేంద్ర సంక్షేమ పథకాల ఫలాల్లో 22 శాతం నుండి 37 శాతం వరకు లబ్ధిదారులు మైనారిటీ వర్గాల వారే ఉన్నారని స్పష్టం చేశారు. విద్యార్థులకు భారీగా స్కాలర్‌షిప్‌లు, సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రత్యేక ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పొరుగు దేశాల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొని వచ్చిన శరణార్థులకు పౌరసత్వం కల్పించే చట్టమే సీఏఏ అని, అయితే కాంగ్రెస్ పార్టీ దీనిపై తప్పుడు ప్రచారం చేస్తూ అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్ర పన్నిందని మండిపడ్డారు. వందేమాతరం' ఏ మతానికీ వ్యతిరేకం కాదని, పవిత్రమైన భరతమాతను గౌరవించే జాతీయ గేయమని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనపై హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాటంలో జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్ వంటి దేశ భక్తులు సైతం వందేమాతరం నినదిస్తూ ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని కించపరచవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్, గత బీఆర్ ఎస్ ప్రభుత్వాలు మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్లు, గన్‌మెన్లకే పరిమితమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా మరియు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా మైనారిటీ యువతకు వేలాదిగా ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ మాత్రం ఓట్ల కోసమే మైనారిటీల పేరును వాడుకుంటోందని స్పష్టం చేశారు. అధికారంలో ఎవరున్నా వారికి వత్తాసు పలికే మజ్లిస్ పార్టీ నాడు బీఆఎస్‌తో, నేడు కాంగ్రెస్‌తో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ పాతబస్తీ అభివృద్ధిని అడ్డుకుందని, బీజేపీ పోరాటం వల్లే పాతబస్తీకి మెట్రో మంజూరైందని గుర్తుచేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై మజ్లిస్ అభ్యర్థిని గెలిపించాయని ఆయన గుర్తుచేశారు. నేడు అదే మజ్లిస్ ఎమ్మెల్సీ ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్లు ఎందుకు నోరు మెదపడం లేదని రామచందర్ రావు సూటిగా ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీకి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ , ఈజిప్ట్, బహ్రెయిన్, జోర్డాన్ వంటి ప్రముఖ ఇస్లామిక్ దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలు అందించి గౌరవిస్తుంటే విపక్షాలు మాత్రం రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేస్తూ మోదీ సంక్షేమ ఫలాలను గ్రామాలు, మండలాల వారీగా ఇంటింటికీ చేరవేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని మైనారిటీ మోర్చా శ్రేణులకు పిలుపునిచ్చారు.

# సాంకేతికత ఆవిష్కరణలే పోలీసింగ్‌కు దిక్సూచి

- **యువ ఐపీఎస్ అధికారులను అభినందించిన డిజిపి**
- **కోర్టు కేసులు, న్యాయ ప్రక్రియలపై మరింత దృష్టి**
- **నిరంతర శిక్షణతో వృత్తి నైపుణ్యాల మెరుగుదల**
- **క్లస్టర్-1లో హైదరాబాద్.. క్లస్టర్-2లో రామగుండం టాప్**
- **క్లస్టర్-3లో నల్గొండ.. క్లస్టర్-4లో సూర్యాపేట ప్రథమం**
- **స్థానికనగర గైడ్‌లను పరిశీలించడం**

**హైదరాబాద్, ఆగస్టు 29:**

నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో కృత్రిమ మేధ (ఏఐ), ఆధునిక సాంకేతికతను పోలీసింగ్‌లో విస్తృతంగా వినియోగించాలని డిజిపి సి. వి. ఆనంద్ సూచించారు. తెలంగాణ పోలీసింగ్ దేశంలోనే ముందంజలో ఉండాలంటే క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్), ఇంటర్‌ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్)లను నిరంతరం అప్‌డేట్ చేస్తూ సమర్థంగా అమలు చేయాలని తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో అన్ని విభాగాల పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖలో అందుబాటులో ఉన్న సాంకేతికత ఆధారిత అప్లికేషన్లను మరింత విస్తృతంగా వినియోగించాలని డిజిపి సూచించారు. డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సమాచారాన్ని అప్‌డేట్ చేయాలన్నారు. కొత్త నేర చట్టాల (ఎన్‌సీఎల్) అమలు, ఈసాక్ష్య, ఈఫోరెన్సిక్, ఐసీజేఎస్ అనుసంధానం, జాతీయ స్థాయి పోర్టళ్లలో తెలంగాణ పనితీరుపై సమీక్షించారు. మెరుగుపరచాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల నిర్వహణకు పోలీసులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిజిపి సూచించారు. న్యాయ ప్రక్రియలను కచ్చితంగా పాటిస్తూ కేసుల పురోగతిని సమర్థంగా పర్యవేక్షించాలన్నారు. దర్యాప్తు, కోర్టు విధానాలు, న్యాయపరమైన అంశాలపై పోలీసులకు నిరంతరం శిక్షణ ఇవ్వాలని చెప్పారు. జిల్లా శిక్షణా కేంద్రాలు, నగర శిక్షణా కేంద్రాలు, పోలీసు శిక్షణా కళాశాలలు, బెటాలియన్లు, పోలీసు అకాడమీలు నిర్వహించే శిక్షణా కార్యక్రమాలు మారుతున్న నేర పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని సూచించారు. నిరంతర శిక్షణతో సిబ్బంది నైపుణ్యాలు, విశ్లేషణ సామర్థ్యం పెరిగి విధుల నిర్వహణ మరింత సమర్థంగా సాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో నేర నియంత్రణకు సంబంధించిన వివిధ ప్రమాణాల అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు విభాగాలను ఆనంద్ అభినందించారు. క్లస్టర్ 1లో హైదరాబాద్, క్లస్టర్ 2లో రామగుండం, క్లస్టర్ 3లో నల్గొండ, క్లస్టర్ 4లో సూర్యాపేట ప్రథమ స్థానాల్లో నిలిచాయి. ఆయా విభాగాల అధికారులను డిజిపి సర్టిఫికెట్లతో సత్కరించారు. ఏఐ ఆధారిత అప్లికేషన్లను రూపొందించి పోలీసు శాఖలో అంతర్గత సామర్థ్యం, పర్యవేక్షణ ను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్న యువ ఐపీఎస్ అధికారులను డిజిపి అభినందించారు. ఆధునిక సాంకేతికతను పోలీసింగ్‌తో అనుసంధానిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా మరిన్ని వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. 2013 బ్యాచ్, ఆపై బ్యాచ్‌లకు చెందిన ఐపీఎస్ అధికారులతో నిర్వహించిన నాయకత్వ లక్షణాలు అంశాలపై డిజిపి కీలక ఉపన్యాసం చేశారు. నాయకత్వంలో ముందుండి నడిపించడం, నిజాయితీ, బృంద స్ఫూర్తి వంటి అంశాల ప్రాధాన్యాన్ని వివరించారు. మారుతున్న నేర ధోరణులను ఎదుర్కొనేందుకు అన్ని



పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని డిజిపి ఆదేశించారు. పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగం, డేటా ఆధారిత నేర విశ్లేషణ, వృత్తిపరమైన శిక్షణ, సిబ్బంది హేతుబద్ధమైన వినియోగం కలగలిపితే పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా, ప్రజలకు స్పందించేలా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. సమావేశంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, జైళ్ల డీజీ సౌమ్య మిశ్రా, ఆర్‌బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, మహిళా భద్రత విభాగం డీజీ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతు భూ హక్కులకు పూర్తి రక్షణే లక్ష్యం

- **ఏడాదిలో రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమికి సమగ్ర సర్వే**
- **వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు**
- **భూ భారతి ద్వారా తాతల కాలం నాటి భూ సమస్యలకు పరిష్కారం**
- **నూతన్‌కల్‌లో 1,061 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ**
- **రెవెన్యూ మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్/ సూర్యాపేట, ఆగస్టు 29:**



రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని, రానున్న ఏడాది కాలంలో వివాదరహిత భూముల ప్రతి అంగుళాన్ని సమగ్రంగా సర్వే చేసి, అర్హులైన నిజమైన భూ ఆసాములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల కేంద్రంలో నూతన్‌కల్, మద్దిరాల మండలాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతూ 15 గ్రామాలకు చెందిన 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాలను మంత్రి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏళ్లతరబడి భూములను సాగు చేసుకుంటున్నా పట్టాలు లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. అన్ని జిల్లాల్లో తాతల కాలం నుంచి పరిష్కారం కాకుండా ఉన్న భూ సమస్యలను భూ భారతి ద్వారా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా సర్వే చేసి వాస్తవంగా భూమిని అనుభవిస్తున్న అర్హులైన రైతుల హక్కులను రికార్డుల్లో నమోదు చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే ప్రక్రియ చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురవుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌బుక్స్ అందిస్తాం. అర్హత ఉన్న ప్రతి భూ ఆసామికి న్యాయం చేస్తాం అని మంత్రి పునరుద్ఘాటించారు. భూమికి చట్టబద్ధమైన హక్కు ఉంటేనే రైతుకు సంపూర్ణ ధైర్యం, ఆర్థిక భద్రత లభిస్తుందని అన్నారు. భూ హక్కుల రికార్డులు సక్రమంగా ఉంటే రైతులు బ్యాంకు రుణాలు, రైతు సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను సులభంగా పొందగలుగుతారని తెలిపారు. గత ప్రభుత్వం తమపై రూ.8.21 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడా ఆగకూడదన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులకు న్యాయం చేయడం, పేదలకు ఇళ్లు ఇవ్వడం, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని స్పష్టం చేశారు. గత రెండురేళ్లల్లో రాష్ట్రంలోని మహిళలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. రానున్న రెండున్నరేళ్లల్లోనూ ఇదే స్థాయిలో రుణాలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో కోట్ల రూపాయల విలువైన భూముల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి తొలి విడతగా 3,500 ఇళ్లు, రెండో విడతగా 2,000 ఇళ్లు మంజూరు చేశామని, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పట్టాదారు పాస్‌బుక్స్ జారీ చేయడమే సరైన పరిష్కారమని అన్నారు. భూమికి హక్కు ఉంటే రైతుకు ధైర్యం వస్తుందని, రైతు భరోసా, రైతుబీమా తదితర ప్రభుత్వ ప్రయోజనాలను రైతులు పొందగలుగుతారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.36 వేల కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి ఇప్పటికే రూ.100 కోట్ల విలువైన రోడ్లు మంజూరు చేశామని, మరో రూ.200 కోట్ల ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

# తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు రావాలి

**మొదటిపేజీ తరువాయి**

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల అధికారులతో ఆయన శనివారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూములకు సంబంధించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పనిచేయాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ లాగిన్ లో 45 దరఖాస్తులు ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి, దీనిపై సదరు అధికారిని వివరణ కోరాలని ఆదేశించారు.

**రీ-సర్వేలోనూ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ**

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత చేపట్టిన రీసర్వేకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డిసెంబర్‌లో రెండో విడత రీసర్వే చేపట్టేందుకు ఇప్పటి నుంచే అధికారులు సిద్ధం కావాలని సూచించారు. తొలి విడతలో రీసర్వే చేపడుతున్న 70 గ్రామాల్లో సర్వేను పారదర్శకంగా నిర్వహించి గ్రామ సరిహద్దులను పక్కాగా నిర్ధారించాలని ఆదేశించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో రీసర్వేను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, ఆర్డీవోలు, తహసీల్దార్లు కూడా గ్రామసభలకు హాజరై పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. సర్వే నిర్వహించిన రోజే భూ రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, సర్వేయర్ల కొరత ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే పక్క మండలాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని పొంగులేటి అన్నారు. విధులకు సరిగా హాజరుకాని లైసెన్స్‌డ్ సర్వేయర్ల లైసెన్సులను రద్దు చేయాలని సూచించారు. కలెక్టర్లు, ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో రీసర్వేను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

**రూ. 230కే సిమెంట్ బస్తా**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సంక్షేమం కోసం రూ. 230కే సిమెంట్ బస్తా అందించేలా ప్రభుత్వం కంపెనీలతో ఒప్పందం చేసుకుందని మంత్రి వెల్లడించారు. తొలి విడత అసంపూర్తి ఇళ్లను దసరాలోపు పూర్తి చేయాలని, ఎల్3 సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నల్గొండ పట్టణంలో 'ఇందిరమ్మ టవర్స్' కింద 500 గృహాల నిర్మాణానికి వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వివిధ దశల్లో నిలిచిపోయిన నిర్మాణాలను గుర్తించి 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఇళ్లకు సమీపంలో ఎక్కడ ఇసుక లభిస్తే అక్కడి నుంచి అందించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఇంటి పట్టాల పంపిణీ వేగవంతం చేయాలి**

గతంలో ఇంటి పట్టాల కోసం భూములను గుర్తించినప్పటికీ ఇంకా పంపిణీ చేయని వాటిని వెంటనే గుర్తించి జాబితా రూపొందించాలని, అర్హులైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను కూడా చట్టానికి లోబడి శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్**

వడ్డీలకే సంపాదన అంతా ఖర్చు చేస్తున్నాం

సూర్యాపేట : ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగడంలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధనిక రాష్ట్రం అంటూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాము ఎంతో యాతన పడుతున్నామన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్ బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



# ప్రాణహితచేవెళ్లకు మళ్లీ జీవం

**మొదటిపేజీ తరువాయి**

బ్యారేజీకి తరలించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఈ ప్రతిపాదనతో ప్రాజెక్టు నిర్వహణలో వ్యయం, విద్యుత్ వినియోగం తగ్గే అవకాశాలను అధికారులు పరిశీలించారు.

**ముంపు, సాంకేతిక అంశాలపై సమీక్ష**

బ్యారేజీ నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలను అధికారులు, ఇంజనీర్లు సమగ్రంగా సమీక్షించారు.

**కేంద్రం చొరవతో చర్చలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం సానుకూల పరిణామమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న జరిగే చర్చల్లో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకారం సాధించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



# రీల్స్ కోసం కాదు.. రియల్ లైఫ్ కోసం ఆడండి

- **క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి**
- **మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులు**

**హైదరాబాద్ ఆగస్టు 29 :**

భారతీయ క్రీడా స్ఫూర్తిని ప్రపంచ పటంలో సమున్నత స్థాయిలో నిలిపిన మహానుభావుడు ధ్యాన్‌చంద్ అని క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కొనియాడారు. ఆయన చూపిన క్రమశిక్షణ, ఏకాగ్రత ప్రతి క్రీడాకారుడికీ మార్గదర్శకమన్నారు. భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి శ్రీహరి, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, క్రీడా శాఖ వీసీ & ఎండీ డాక్టర్ ఎ.సోనిబాలదేవి, హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండా విజయ్‌లు హాజరయ్యారు. ప్రస్తుత యువత తమ సమయాన్ని సోషల్ మీడియా రీల్స్‌పై వృథా చేయకుండా భవిష్యత్తు కోసం క్రీడల వైపు దృష్టి సారించాలని మంత్రి ఉద్బోధించారు. రీల్స్ కోసం కాకుండా రియల్ లైఫ్ కోసం ఆటలు ఆడండి అని సూచించారు. తొలుత స్టేడియం ప్రాంగణంలోని మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి వారు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ హాకీ లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను మంత్రి, చైర్మన్ ప్రారంభించారు. క్రీడా హబ్‌గా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి 'స్పోర్ట్స్ హబ్'గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, అధునాతన మౌలిక వసతులు, తగిన ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత గాయత్రి గోపీచంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి త్రీసా జాలీ, ఆసియా అథ్లెట్ నందిని అగాసరాతో పాటు క్రీడా శాఖ అధికారులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలి

- **వ్యాధులు వ్యాప్తిచెందకుండా అరికట్టడమే లక్ష్యం**
- **వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్**

**హైదరాబాద్, ఆగస్టు 29 :**

వ్యాధులు ప్రబలిన తర్వాత చికిత్స అందించడం కంటే ముందుగానే అరికట్టడం ఆరోగ్య శాఖ ప్రధాన లక్ష్యంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ పేర్కొన్నారు. అన్ని జిల్లాల ఆరోగ్య యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పనిచేస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల పరిస్థితి, వ్యాధుల నివారణకు చేపడుతున్న చర్యలు, ప్రభుత్వ హాస్పిటళ్ల సంసిద్ధత, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ సచివాలయంలో శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా తదితర సీజనల్ వ్యాధుల ప్రస్తుత పరిస్థితి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన కేసులు, జిల్లాల వారీగా పరిస్థితి, ఫీవర్ సర్వేలు, దోమల నివారణ చర్యలు, ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ల పనితీరు తదితర అంశాలను అధికారులు మంత్రికి వివరించారు. జనవరి 1 నుంచి ఈనెల 27 వరకు రాష్ట్రంలో నమోదైన సీజనల్ వ్యాధుల కేసులను గత ఏడాది ఇదే కాలంతో పోల్చగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, అక్యూట్ డయేరియల్ డిసీజ్, డిసెంట్రీ కేసులు తగ్గినట్లు అధికారులు తెలిపారు. అయితే టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయని, కేసులు పెరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల కేసులు పెరుగుతున్నందున ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత పెంచాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని మంత్రి సూచించారు. సర్వేలో గుర్తించిన ప్రతి జ్వరం కేసును పర్యవేక్షిస్తూ అవసరమైన వారికి సకాలంలో పరీక్షలు, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అది అంటరానితనానికి మరో రూపం

- ఖర్గే దళితుడైనందుకే మైదానం శుద్ధి చేశారా?
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ ఆగ్రహం
- బాధ్యులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- హల్ద్వానీ ఘటనపై ముదిరిన వివాదం



**ఢిల్లీ, ఆగస్టు 29 :** ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. భారతీయ జనతాపార్టీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో అస్పృశ్యతను చట్టబద్ధంగా నిషేధించారని, మల్లికార్జున ఖర్గే దళితుడనే కారణంతో ఇలా మైదానాన్ని శుద్ధి చేయడం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని రాహుల్ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'శుద్ధీకరణ' సమాజంలో ఇంకా బతికే ఉన్న అంటరానితనానికి మరో పేరని ఆయన వ్యాఖ్యానించారు. శుద్ధీకరణ పూజను నిర్వహించిన వారిపై, దీనికి మద్దతు ఇచ్చిన ఉత్తరాఖండ్ స్థానిక బీజేపీ నేతలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు సమాజంలో ఎదగడం, గౌరవంగా బతకడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదని, ఈ ఘటన వారి కులవివక్ష భావజాలాన్ని స్పష్టం చేస్తోందని మండిపడ్డారు.

### ఇంతకీ ఏం జరిగిందంటే..

ఆగస్టు 8వ తేదీన హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఖర్గే ర్యాలీ ముగిసిన రెండు రోజుల తర్వాత 'శ్రీరామ్ సేన' అనే స్థానిక సంస్థ ఆ మైదానంలో గంగాజలం చల్లి, హవనం (పూజ) నిర్వహించి మైదానాన్ని 'శుద్ధి' చేసింది. దీంతో వివాదం మొదలైంది.

## సంపాదకీయం



# నేపాల్‌లో సహాయక చర్యలే పెను సవాల్!

### వరద బురదలో కొనసాగుతున్న గాలింపు

### మృతదేహాల భద్రతకు మార్చురీల కొరత

ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన నేపాల్‌లో ఇప్పుడు సహాయక చర్యలే పెను సవాల్‌గా మారాయి. ఊళ్లకు ఊళ్లు దెబ్బతినడం, రహదారులు, ఇతర మౌలిక వసతులు ధ్వంసం కావడంతో బురద తొలగింపు నుంచి గల్లంతైన వారి కోసం గాలింపు వరకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. పర్యాటక రంగంపై ఎక్కువగా ఆధారపడే నేపాల్‌కు ఈ విపత్తు నుంచి పూర్తిగా కోలుకోవడం, ధ్వంసమైన ప్రాంతాలను పునర్నిర్మించడం దీర్ఘకాలిక సవాల్‌గా మారే పరిస్థితి కనిపిస్తోంది. అందుతున్న సమాచారం ప్రకారం వరదల్లో మృతుల సంఖ్య 600 దాటగా, 2,500 మందికి పైగా ఆచూకీ తెలియాల్సి ఉంది. గాలింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో గల్లంతైన వారిని గుర్తించడంతో పాటు వెలికితీస్తున్న మృతదేహాలను భద్రపరచడం కూడా అధికారులకు పెద్ద సమస్యగా మారింది. నేపాల్‌లోని మార్చురీలన్నింటి సామర్థ్యం కలిపి సుమారు 350 మృతదేహాలకే పరిమితమని సమాచారం. మృతుల సంఖ్య ఇప్పటికే అంతకు మించిపోవడంతో ఆస్పత్రులు, మార్చురీలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. అక్కడ ఉష్ణోగ్రతను సుమారు సున్నా డిగ్రీల వద్ద ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నాయి. మృతదేహాల ఫొటోలు తీసి, అవసరమైతే శుభ్రపరిచిన అనంతరం ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో కూడిన ట్యాగ్‌ను బాడీ బ్యాగ్‌కు అమర్చుతున్నారు. ఆ తర్వాత తాత్కాలిక భద్రతా కేంద్రాలకు తరలిస్తున్నారు. గల్లంతైన వారి కోసం వచ్చే కుటుంబ సభ్యులకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను చూపించి గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించిన తర్వాత అవసరమైన అధికారిక ప్రక్రియను పూర్తి చేసి మృతదేహాన్ని అప్పగిస్తున్నారు. ముఖం ఆధారంగా గుర్తించడం సాధ్యం కాని మృతదేహాల విషయంలో వేలిముద్రలు, డీఎన్ఏ సహా అవసరమైన నమూనాలను సేకరిస్తున్నారు. వెంటనే గుర్తింపు సాధ్యం కాకపోయినా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల్లో గుర్తించేందుకు వీటిని భద్రపరుస్తున్నారు. బంధువులు ఎవరూ ముందుకు రాని లేదా గుర్తించలేని మృతదేహాలను నిరవధికంగా భద్రపరచడం సాధ్యం కాకపోవడంతో.. అవసరమైన నమూనాలు సేకరించి, గుర్తింపు ట్యాగ్‌లు అమర్చిన తర్వాత నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గుర్తుతెలియని, ఎవరూ స్వీకరించని మృతదేహాల నిర్వహణకు జిల్లా స్థాయి యంత్రాంగం కేంద్ర అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. విపత్తు తీవ్రత పెరగడంతో నేపాల్ విదేశీ సహాయక బృందాల సేవలను స్వీకరిస్తోంది. భారత్, చైనాకు చెందిన గాలింపు, సహాయక బృందాలను కొన్ని ప్రభావిత ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు సమాచారం. గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో నిపుణుల బృందాలు స్థానిక అధికారులతో కలిసి గాలింపు చర్యల్లో పాల్గొంటున్నాయి. ప్రస్తుతం గల్లంతైన వారిని గుర్తించడం, బాధితులను ఆదుకోవడం, మృతదేహాలను గుర్తించి కుటుంబాలకు అప్పగించడం తక్షణ ప్రాధాన్యంగా మారింది. అయితే ఆ తర్వాత నేపాల్ ముందున్న మరో భారీ సవాల్ పునర్నిర్మాణం. వరదల్లో దెబ్బతిన్న గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను తిరిగి నిర్మించాల్సి ఉంది. వరద నీరు తగ్గినా నేపాల్ కష్టాలు మాత్రం తగ్గలేదు. బురదలో గల్లంతైన వారి కోసం గాలింపు ఒకవైపు.. మృతుల గుర్తింపు మరోవైపు.. ధ్వంసమైన ప్రాంతాల పునర్నిర్మాణం ఇంకోవైపు.. ఇప్పుడు ఆ చిన్న దేశం ముందున్నది సుదీర్ఘమైన పునరుద్ధరణ పోరాటమే.



# ప్రధాని మరోమారు విదేశీ పర్యటన

### ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌లలో పర్యటించనున్న మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** ప్రధాని నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధం అయ్యారు. రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. ఉజ్బెకిస్తాన్‌లో ప్రధాని మోదీకి ఇది నాలుగో పర్యటన కానుంది. ఈ పర్యటనలో భారత్, ఉజ్బెకిస్తాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. అలాగే డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి. భారత్ 'విక్షిత్ భారత్ 2047' అభివృద్ధి దార్శనికతతో పాటు ఉజ్బెకిస్తాన్ 'ఉజ్బెకిస్తాన్–2030' అభివృద్ధి ప్రణాళికలపై కూడా ఇరు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి జరగనుంది. భవిష్యత్‌లో ఆర్థిక, సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. తాష్కెంట్‌లో ప్రధాని మోదీ పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి మెమోరియల్‌ను సందర్శించడంతో పాటు తాష్కెంట్ స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కిర్గిజ్ రిపబ్లిక్‌లో పర్యటించనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. షాంఘై 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. 2017 నుంచి భారత్ షాంఘైలో పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. షాంఘై సమావేశంలో భద్రత, అనుసంధానం, ప్రాంతీయ సహకారం, అభివృద్ధి అవకాశాలపై భారత ప్రాధాన్యతలను ప్రధాని మోదీ ప్రస్తావించనున్నారు. ఈ సందర్భంగా షాంఘై సభ్యదేశాల నేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే కిర్గిజ్ రిపబ్లిక్‌లో జరిగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కూడా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. మధ్య ఆసియా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ క్రీడలు ప్రాంతీయ సాంస్కృతిక సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

# నేపాల్ వరదల్లో మరో విషాదం

### ఆచూకీ లేని ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సిఇవో

### లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది. ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. కాగా.. నేపాల్–చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి. ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది. అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

# ఢిల్లీలో పెరిగిన సీఎన్‌జీ ధరలు

### కిలోపై రూ.3.89 చొప్పన పెంపు




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో సీఎన్‌జీ ధరలు మరోసారి పెరిగాయి. శనివారం ఉదయం 6 గంటల నుంచి కిలో సీఎన్‌జీపై రూ.3.89 చొప్పున పెంచుతున్నట్లు నగర గ్యాస్ పంపిణీ సంస్థ ఇందప్రస్థ గ్యాస్ లిమిటెడ్ ప్రకటించింది. దీంతో ఢిల్లీలో ప్రస్తుతం కిలో సీఎన్‌జీ ధర రూ.86.98కి చేరుకుంది. అలాగే, నోయిడాలో రూ.95.59, ఘాజియాబాద్‌లో రూ.95.59, గురుగ్రామ్‌లో రూ.92.01, మీరట్‌లో రూ.95.47, ముజఫర్‌నగర్‌లో రూ.95.47, షామ్లిలో రూ.95.47కు ధరలు చేరుకున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లో ఎల్ఎన్‌జీ ధరలు భారీగా పెరగడం తాజా ధరల పెంపునకు ప్రధాన కారణమని ఐజీఎల్ వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత సీఎన్‌జీ ధరలు పెరగడం ఇది ఐదోసారి. మే 15 నుంచి ఇప్పటివరకు నాలుగు విడతల్లో ధరలు పెరిగాయి. తాజా పెంపుతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో వేలాది మంది సీఎన్‌జీ వాహనదారులపై అదనపు భారం పడనుంది. సీఎన్‌జీతో నడిచే ప్రైవేటు కార్లు, ట్యాక్సీలు, ఆటోలు, వాణిజ్య వాహనాల నిర్వహణ వ్యయం పెరగనుంది. దీంతో ఈ భారం చివరికి ప్రయాణికులపై పడనుంది. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ ధరలు సంక్షోభానికి ముందు స్థాయితో పోలిస్తే దాదాపు రెట్టింపయ్యాయని ఐజీఎల్ తెలిపింది. సీఎన్‌జీ సరఫరాకు అవసరమైన సహజ వాయువులో గణనీయమైన భాగాన్ని దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీ ద్వారానే సమకూర్చుకుంటున్నామని పేర్కొంది. హోర్ముజ్ జలసంధి మీదుగా ఎల్ఎన్‌జీ కార్గో రవాణాకు అంతరాయం ఏర్పడటంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయని వివరించింది. అలాగే, శీతాకాలం సమీపిస్తుండటంతో యూరప్ దేశాలు సహజ వాయువు నిల్వలను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పింది. దీంతో ఎల్ఎన్‌జీ ధరలకు రెక్కలొచ్చి సీఎన్‌జీ సరఫరా వ్యయం గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ఈ కారణంగానే రేట్లు పెంచాల్సిన పరిస్థితి నెలకొందని ఐజీఎల్ వెల్లడించింది.

# నేపాల్ వరదలపై మల్లికార్జున ఖర్గే ఆందోళన

### తక్షణ సాయం అందించాలని మోడీకి లేఖ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.





## 630 అంగన్వాడి కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు

**శెనార్తి మీడియా, ములుగు :**

చిన్నారులకు మెరుగైన విద్యా, ఆరోగ్య వసతులు కల్పించే లక్ష్యంతో ములుగు సర్కిల్ పరిధిలోని 630 అంగన్వాడి కేంద్రాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు ఎన్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్ష పతి తెలిపారు. విద్యుత్ సౌకర్యంతో అంగన్వాడి కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి మోటార్లు తదితర పరికరాల వినియోగం సాధ్యమై చిన్నారులకు సౌకర్యవం తమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రీ–స్కూల్ కార్యక్రమాలు, పోషకాహార పంపిణీ, పరిశుభ్రత, ఆరోగ్య కార్యక్రమాల నిర్వ హణకు కూడా ఇది దోహదపడుతుం దని పేర్కొన్నారు. చిన్నారుల సంక్షేమా న్ని సామాజిక బాధ్యతగా భావించి అంగన్వాడి కేంద్రాల్లో అవసరమైన విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

# 'సెయింట్ జార్జ్'లో తెలుగు భాషా దినోత్సవం

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**




తెలుగు భాషా సంస్కర్త గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని కొత్తపల్లి పట్టణంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో శనివారం తెలుగు భా షా దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనం, మాధుర్యం, సాహిత్య వైభవం, మన సంస్కృతి, సంప్ర దాయాల విశిష్టతను వివిధ కార్యక్రమాల ద్వారా వివరించారు. తెలుగు పద్యాలు, కవితలు, ప్రసంగాలు, పాటలు పాడి తమ ప్రతిభను చాటుకున్నారు. స్కూల్ చైర్మన్ ఫాతిమారెడ్డి మాట్లా డుతూ గిడుగు వెంకట రామ్మూర్తి తెలుగు భాషను సామాన్య ప్రజలకు చేరువ చేయ డంలో, వ్యావహారిక భాషోద్యమానికి బలమై న పునాది వేయడా నికి కృషి చేశారన్నారు. విద్యార్థులు తమ మాతృభాషను ప్రేమించి, గౌరవించాల న్నారు. కార్యక్రమంలో ప్రిన్సి పల్, వైస్ ప్రిన్సిపల్, టీచర్స్ పాల్గొన్నారు.

## జీవో 99 రద్దు చేయాలి

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**



మాలల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 31న హైదరా బాద్లోని డా.బీఆర్ అంబేద్కర్ సచివా లయం వద్ద నిర్వహించే 'చలో సెక్రటేరి యట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని గన్నేరువరం మండల మాల మహా నాడు అధ్యక్షుడు అనుమండ్ల మల్లేశం, గౌర వ అధ్యక్షుడు న్యాత సుధాకర్ పిలుపుని చ్చారు. శనివారం గన్నేరువరంలో వారు మాట్లాడుతూ జీవో నంబర్ 99ను రద్దు చేయడంతో పాటు రోస్టర్ విధానంలోని రెండు పాయింట్లను సవరించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి మాలలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత అవ కాశాలు కల్పించాలని కోరారు. మాలల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, రాజ్యాంగబద్ధ హక్కుల కోసం చేపట్టే 'చలో సెక్రటేరియట్'కు రాష్ట్రవ్యాప్తంగా మాలలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో తుమ్మ ప్రభాకర్, కర్నే కొమురయ్య, న్యాత రాజేందర్, మీసాల ప్రభాకర్, వ్యాక రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రజితకు అండగా ఉంటాం



- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

గంగాధర మండలం వెంకటాయపల్లికి చెందిన ఇడగొట్టి వెంకటి –హారిక దంపతుల కుమార్తె ఇడగొట్టి రజితకు అండగా ఉంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. రజిత పుట్టుకతోనే దివ్యాంగురాలు కావడంతో తల్లిదండ్రులు కూలీపనులకు వెళుతూ కష్టపడి చిన్నారిని పెంచుతున్నారు. రజిత పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం వారి ఇంటికి వెళ్లి రజిత పరిస్థితిని గమనించి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎంపీడీవో దమ్మని రాముతో మాట్లాడి రజితకు వికలాంగుల పెన్షన్ వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ గంకిడి సంధ్య–రామచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ ఆసిఫ్, నాయకులు మోహన్ రెడ్డి, గుర్రం నర్సాగౌడ్, సురేష్, జయంత్ ఉన్నారు

## పౌర హక్కుల దినోత్సవానికి అధికారుల గైర్హాజరు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండల స్థాయి అధికారులు సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి గైర్హాజరు కావడం పై దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కరీంపేట గ్రామంలో శనివారం నిర్వహించిన కార్య క్రమానికి పలువురు మండల స్థాయి అధి కారులు హాజరు కాలేదు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం నియోజక వర్గ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఆరెపల్లి ఓదెలు, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆడెపు నర్సయ్య మాట్లాడారు. గ్రామాల్లో చూపే వివక్ష కంటే అధికారులే తమపై ఎక్కువ వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌర హక్కుల దినోత్సవానికి అధికారులు గైర్హాజరు కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ సురేఖ వెంటనే కరీంపేటకు చేరుకుని అధికారుల గైర్హాజరుపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అధికారులకు వీలున్న రోజునే కార్యక్రమం నిర్వహించి ఉంటే బాగుండే దని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. రాబోయే సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజర య్యేలా చూస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా రెండు గ్లాసుల పద్ధతి లేదని, కులాల పేరుతో వివక్షకు తావులే దని చెప్పారు. అలాంటి ఘటనలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి అధికారులు సామూహిక భోజనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎగ్గని శ్రీలత, ఉప సర్పంచ్ చింతం రాజేశం, నాయబ్ తహసీల్దార్ సాయికృష్ణ, పశువైద్య అధికారి మాధవరావు, గిర్దావారి రాములు, సీనియర్ సహాయకుడు నరోత్తం రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుమన్, జీపీవో భాస్కర్, ఏఎన్ఎం మల్లిక, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రీడలకు పెద్దపీట.. స్పోర్ట్స్ హబ్‌గా హనుమకొండ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా సదుపాయాలు.. క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలి...
- క్రీడాకారుల ప్రతిభకు ప్రభుత్వం అండ.. అంతర్జాతీయ ప్రమాణాలతో సదుపాయాలు



**శెనార్తి మీడియా, హనుమకొండ, :** విద్య, వైద్యం, క్రీడారంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హనుమకొండలో అంతర్జాతీయ ప్రమాణా లతో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హనుమకొండలో అభివృద్ధి చేసిన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో పునర్ని ర్మాణ పనులు పూర్తయిన బ్యాడ్మింటన్ స్టేడియంను ప్రారంభించారు. మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జేఎన్ఎస్‌లో క్రీడాకారుల కోసం కల్పించిన ఆధునిక సదుపాయా లను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిం చాలని సూచించారు. క్రీడాకారులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే ఉన్న ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడంతో పాటు స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నాయిని వెల్లడిం చారు. వరంగల్ ప్రాంతం క్రీడాకారులకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిందని, ఇక్కడి నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తీసుకువచ్చా రన్నారు. ప్రస్తుత తరం క్రీడాకారులు క్రమ శిక్షణ, పట్టుదలతో శిక్షణ పొంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. క్రీడల్లో సాధించే విజయం వ్యక్తిగత విజయమే కాకుండా కుటుంబానికి, ప్రాంతానికి, జిల్లాకు, రాష్ట్రానికి గర్వకార ణమని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభతో హనుమకొండ పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన రోజే తమకు నిజమైన బహుమతి అని అన్నారు.

**అభివృద్ధి మాటల్లో కాదు.. చేతల్లో కనిపించాలి...**

వరంగల్ ప్రాంత అభివృద్ధిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వరంగల్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతు న్నారని అన్నారు. గత రెండున్నరేళ్లలో విద్య, వైద్యం, క్రీడలు, మౌలిక వసతుల రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిం దని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్‌రోడ్, విమానాశ్రయం తదితర కీలక ప్రాజెక్టుల విషయంలో ముందడుగు పడిందని చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్, ఎస్టీపీల ఏర్పాటు, భూసేకరణ తదితర ప్రక్రియలు కొనసాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో వరంగల్ ప్రాంతానికి వచ్చిన నిధులు, ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చిన నిధులను ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. మీరు రూ.20 కోట్లు తీసు కువస్తే మేము రూ.80 కోట్లు తీసుకు వచ్చాం. ఎవరు ఎంత అభివృద్ధి చేశారో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. కేవలం విమర్శ లు చేయడం, సోషల్ మీడియా, యూ ట్యూబ్ ఛానళ్ల ద్వారా దుష్ప్రచారం చేయడం వల్ల అభివృద్ధి జరగదని, ప్రజల కోసం నిధులు తీసుకురావడం, పనులు ప్రారంభించి పూర్తి చేయడమే ప్రజాప్రతిని ధుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఉద్యోగు లకు సంబంధించిన కొన్ని సమస్యలు పరి ష్కరించాల్సి ఉందని, వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, ఉద్యోగులకు న్యా యం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని తెలిపారు. వరంగల్‌కు మరింత విస్తృతమైన పరిపాలనా, అభివృద్ధి అవకా శాలు కల్పిస్తే ఈ ప్రాంతం మరింత వేగం గా అభివృద్ధి చెందుతుందని నాయిని అన్నా రు. గత రెండున్నరేళ్లలోనే ఇంత అభివృద్ధి సాధించాం. భవిష్యత్తులో మరిం త బలమైన పరిపాలనా వ్యవస్థ, కార్పొరే షన్ వంటి అవకాశాలు అందుబాటులోకి వస్తే వరంగల్‌ను ఏ స్థాయిలో అభివృద్ధి చేయవచ్చో ప్రజలు ఆలోచించాలని వివ రించారు. అనంతరం స్విమ్మింగ్ పూల్‌లో క్రీడాకారులు శిక్షణ పొందుతుండగా ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్, ఏసీపీ జితేందర్ రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బ్యాడ్మింటన్ ఆడారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ వెటరన్ క్రీడాకారులు రమణయ్య, కైలాసంలను ఎమ్మెల్యే, కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కైలాస్ యాదవ్, ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఏసీపీ జితేందర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## పాఠశాలల్లో క్రీడా దినోత్సవం



**శెనార్తి మీడియా,శంకరపట్నం:**

హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని కన్నాపూర్ జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ శారీర కంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పు డే అన్ని రంగాల్లో రాణించగలమని చెప్పా రు. విద్యార్థులు ప్రతిరోజూ వ్యాయామం చేయడంతో పాటు వివిధ క్రీడల్లో పాల్గొనా లని సూచించారు. క్రీడల్లో చురుకుగా పాల్గొంటే చదువులోనూ రాణించవచ్చని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రామానంద తీర్థ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా ప్రతిభతో భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారని తెలిపారు. క్రీడాకారుడిగా మాత్రమే కాకుండా ఆయనలో ఉన్న దేశభక్తి, గెలవాలి.. గెలి పించాలనే సంకల్పం ఆయనను గొప్ప క్రీడాకారుడిగా నిలిపాయని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**తాడికల్ ఉన్నత పాఠశాలలో..**

మండలంలోని తాడికల్ ఉన్నత పాఠ శాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఆడెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఎంఈవో లక్ష్మీనారాయణ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు




# ఈత కొలనులో అడుగులు.. పతకాల వైపు పరుగులు!

- బాలసముద్రంలో రూ.40 లక్షలతో నూతన స్విమ్మింగ్ పూల్ ప్రారంభం
- స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**శెనార్తి మీడియా, హనుమకొండ :** జిల్లాలో క్రీడా రంగ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. బాలసముద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (DSA) ఆధ్వర్యంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిం చేలా తీర్చిదిద్దేందుకు మెరుగైన క్రీడా మౌ లిక వసతులు ఎంతో అవసరమని తెలి పారు. స్విమ్మింగ్ వంటి క్రీడలను ప్రోత్స హించడం ద్వారా యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెం పొందుతాయని ఎంపీ పేర్కొన్నారు. జిల్లా లోని క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన స్విమ్మిం గ్ పూల్‌ను క్రీడాకారులు, యువత సద్విని యోగం చేసుకుని తమ ప్రతిభకు పదును పెట్టాలని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డాక్ట ర్ కడియం కావ్య ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికా రులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# అణు భౌతిక శాస్త్ర పితామహుడు రూథర్‌ఫోర్డ్

## నేడు ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ జయంతి

ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871 - అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయనిజ్ఞుడు, ఇతనికి అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు గలదు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం వుంటుందని కనిపెట్టాడు. పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి. ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియజెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశపెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన - కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు. అణువు యొక్క రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదాగ్రహ మండల నమూనా, ఇదే సిద్ధాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహదపడింది) ను ప్రతిపాదించాడు. ఇతడు రూథర్‌ఫోర్డ్ -కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా -కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కెంద్రకం యొక్క ఉనికిని కనిపెట్టాడు. ఇతడికి 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనంలోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయస్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయ-సులోనే కెనడాలోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్నమయ్యాడు. అక్కడే యురేనియం, థోరియంలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియో ధార్మిక విఘటనం (ఘుఒఅశీ ఖ్‌ఓఅజవ నవఘ్యం) నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్థ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు.

కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫాకిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువుల్లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను - కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్యరంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అదృశ్యమైన మనుషులు.. మిగిలేది అంతులేని వేదన!

### నేడు అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం

### బలవంతపు అదృశ్యాలు మానవ హక్కులపై చెరగని మచ్చలు

### ఆచూకీ కోసం ఏళ్ల తరబడి కుటుంబాల నిరీక్షణ

### సత్యం చెప్పడం.. న్యాయం చేయడం ప్రభుత్వాల బాధ్యత

### మనిషి స్వేచ్ఛ, గౌరవం కంటే ఏ అధికారమూ గొప్పది కాదు




ప్రపంచంలో ఒక మనిషి మరణించాడని తెలిస్తే కుటుంబం కన్నీళ్లతోనైనా ఆ నిజాన్ని అంగీకరించే ప్రయత్నం చేస్తుంది. కానీ తమ వ్యక్తి బతికే ఉన్నాడో.. మరణించాడో.. ఎక్కడున్నాడో కూడా తెలియకుండా ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తే..? ఆ బాధకు అంతముండదు. ఆ నిరీక్షణకు సమాధానం ఉండదు. అలాంటి వేలాది కుటుంబాల వేదనను ప్రపంచానికి గుర్తుచేసే రోజే ఆగస్టు 30 - అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం.

### నియంతృత్వాల నీడలో మొదలైన పోరాటం

ఈ దినోత్సవం వెనుక మానవ హక్కుల చరిత్రలోనే అత్యంత విషాదకరమైన అధ్యాయం ఉంది. లాటిన్ అమెరికాలో సైనిక నియంతృత్వ పాలనల కాలంలో ప్రభుత్వాలను ప్రశ్నించిన రాజకీయ కార్యకర్తలు, సామాజిక ఉద్యమకారులు, విద్యార్థులు, సామాన్యులు పెద్ద సంఖ్యలో అదృశ్యమయ్యారు. తమవారు ఎక్కడున్నారో చెప్పాలంటూ బాధిత కుటుంబాలు చేసిన పోరాటమే క్రమంగా అంతర్జాతీయ ఉద్యమంగా మారింది. బలవంతంగా అదృశ్యమైన వారి కుటుంబాలకు చెందిన సంఘాలు ఈ సమస్యను ప్రపంచం ముందుకు తీసుకొచ్చాయి. అనంతర కాలంలో ఐక్యరాజ్యసమితి కూడా బలవంతపు అదృశ్యాల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇలాంటి ఘటనల పరిశీలనకు ప్రత్యేక కార్యబృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు బలవంతపు అదృశ్యాల నుంచి వ్యక్తులను రక్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో చట్టపరమైన వ్యవస్థలను బలోపేతం చేసే ప్రయత్నాలు జరిగాయి.

### అదృశ్యం అంటే.. ఒక మనిషినే కాదు

బలవంతపు అదృశ్యం అంటే ఒక వ్యక్తిని ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా బలగాలు లేదా వాటి మద్దతుతో పనిచేసే వ్యక్తులు అదుపులోకి తీసుకుని.. ఆ తర్వాత అతడి ఆచూకీ లేదా పరిస్థితి గురించి సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టడం. ఇది కేవలం ఒక వ్యక్తి స్వేచ్ఛను హరించడం మాత్రమే కాదు. ఒక కుటుంబాన్ని జీవితాంతం అనిశ్చితిలోకి నెట్టే తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన. "బతికే ఉన్నారా..? మరణించారా..? ఎక్కడున్నారు..?" అనే ప్రశ్నలకు సమాధానం దొరకక కుటుంబ సభ్యులు అనుభవించే మానసిక వేదన వర్ణనాతీతం. ఆచూకీ కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం, న్యాయస్థానాలను ఆశ్రయించడం, ఏ చిన్న సమాచారం వచ్చినా తమవారే కావచ్చనే ఆశతో పరుగులు తీయడం.. ఇలా వారి జీవితమే నిరీక్షణగా మారిపోతుంది.

### ప్రపంచాన్ని వెంటాడుతున్న విషాదం

లాటిన్ అమెరికాలోని అర్జెంటీనా, చిలీ, గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వంటి దేశాల్లో గత సైనిక పాలనల కాలంలో జరిగిన బలవంతపు అదృశ్యాలపై ఇప్పటికీ బాధిత కుటుంబాలు సత్యం, న్యాయం కోసం పోరాడుతున్నాయి. ఆసియాలో శ్రీలంక అంతర్యుద్ధం, నేపాల్‌లో సాయుధ సంఘర్షణల కాలంలోనూ అనేక అదృశ్యం కేసులు నమోదయ్యాయి. పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లోనూ ఇలాంటి ఆరోపణలు మానవ హక్కుల చర్చల్లో తరచూ ప్రస్తావనకు వస్తున్నాయి. సిరియా, ఇరాక్, లెబనాన్ తదితర సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, ఉగ్రవాదం కారణంగా ఆచూకీ తెలియకుండా పోయిన వారి సమస్య మరింత సంక్లిష్టంగా మారింది. యుద్ధం ముగిసినా.. పాలకులు మారినా.. తమవారి కోసం ఎదురుచూసే కుటుంబాల నిరీక్షణ మాత్రం ముగియడం లేదు.

### భారత్‌లోనూ వినిపించిన ప్రశ్నలు

భారత్‌లోనూ సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో అదృశ్యాల ఆరోపణలు గతంలో చర్చకు వచ్చాయి. ముఖ్యంగా కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాదం, తిరుగుబాట్లు, భద్రతా చర్యల నేపథ్యంలో పలువురు అదృశ్యమైనట్లు బాధిత కుటుంబాలు, మానవ హక్కుల సంస్థలు ఆరోపించిన సందర్భాలున్నాయి. ఆయా కేసుల్లో నిజానిజాలను వెలికితీసి బాధిత కుటుంబాలకు సమాధానం చెప్పాలని పౌర సమాజ సంస్థలు కోరుతూ వచ్చాయి.

### కుటుంబాలకు కావాల్సింది ఒక్కటే.. నిజం

బలవంతపు అదృశ్యాల విషయంలో బాధిత కుటుంబాలు కోరుకునేది మొదట సత్యమే. తమవారు ఏమయ్యారు..? ఎక్కడున్నారు..? వారికి ఏం జరిగింది..? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకునే హక్కు వారికి ఉంది. జరిగిన అన్యాయంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టడం, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం, పునరావాసం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. అంతటితో సరిపోదు. మరో కుటుంబానికి ఇలాంటి వేదన ఎదురుకాకుండా చట్టపరమైన రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేయాలి. అరెస్టులు, నిర్బంధాల విషయంలో పారదర్శకత ఉండాలి. అధికార దుర్వినియోగానికి అవకాశం లేకుండా జవాబుదారీతనాన్ని పెంచాలి. మానవ హక్కుల పరిరక్షణను ప్రభుత్వ వ్యవస్థలో విడదీయలేని భాగంగా మార్చాలి.

### జ్ఞాపక దినం కాదు.. న్యాయం కోసం పిలుపు

అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం క్యాలెండర్‌లో మరో జ్ఞాపక దినం మాత్రమే కాదు. సమాధానం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల గొంతుకకు ప్రపంచం చెవివిప్పాల్సిన రోజు. అధికారానికి హద్దులు ఉన్నాయని.. ప్రతి మనిషికీ జీవించే హక్కు, స్వేచ్ఛ, గౌరవం ఉన్నాయని గుర్తుచేసే రోజు. ఒక మనిషిని బలవంతంగా అదృశ్యం చేయడం అంటే అతడి ఉనికిని మాత్రమే చెరిపేయడం కాదు.. ఒక కుటుంబం ఆశలను, వారి ప్రశాంతతను, సమాజం న్యాయంపై పెట్టుకున్న నమ్మకాన్ని కూడా దెబ్బతీయడమే. యుద్ధమైనా.. రాజకీయ సంఘర్షణైనా.. ఉగ్రవాదమైనా.. అధికార ప్రదర్శనైనా.. మనిషి ప్రాణం, స్వేచ్ఛ, గౌరవం కంటే గొప్పవి కావు. అదృశ్యమైన ప్రతి మనిషి వెనుక సమాధానం కోసం ఎదురుచూస్తున్న ఒక కుటుంబం ఉందన్న సత్యాన్ని ప్రపంచం మరవకూడదు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వెండితెర సత్యభామ.. జమున

### ఆగస్టు 30.. జమున జన్మదినం

జనాభాయి అంటే ఎవరో చాలామందికి తెలియకపోవచ్చు. జూలూరి జమున అన్నా వెంటనే గుర్తుపట్టకపోవచ్చు. కానీ 'జమున' అనగానే తెలుగు సినీ ప్రేక్షకుల మదిలో ఓ అపురూప రూపం మెదులుతుంది. గడుసుదనం.. గాంభీర్యం.. అందం.. అభినయం.. ఆత్మవిశ్వాసం కలగలిసిన కథానాయిక గుర్తుకొస్తుంది. మరీ ముఖ్యంగా సత్యభామ అంటే జమున.. జమున అంటే సత్యభామ అన్నంతగా ఆ పాత్రపై తనదైన ముద్ర వేసిన అలనాటి మేటి నటి ఆమె. జమున 1936 ఆగస్టు 30న హంపీలో జన్మించారు. తల్లి కౌసల్యాదేవి, తండ్రి వ్యాపారవేత్త నిప్పని శ్రీనివాసరావు. ఆమె బాల్యం గుంటూరు జిల్లా దుగ్గిరాలలో గడిచింది. తల్లిదండ్రులు తొలుత పెట్టిన పేరు జనాభాయి. జన్మ నక్షత్రం ప్రకారం నది పేరు ఉండాలన్న సూచనతో మధ్యలో 'ము' అక్షరాన్ని చేర్చి జమునగా మార్చారు. సినిమా రంగంలోకి వచ్చిన తర్వాత పెట్టుకున్న పేరు కాదది. చిన్నతనం నుంచే జమునకు కళలపై ఆసక్తి ఎక్కువ. శాస్త్రీయ సంగీతం, హార్మోనియంలో శిక్షణ పొందారు. పాఠశాల రోజుల నుంచే నాటకాల్లో నటించేవారు. సినీనటుడు జగ్గయ్యది కూడా దుగ్గిరాల కావడంతో ఆయన కుటుంబంతో జమున కుటుంబానికి పరిచయం ఉండేది. తెనాలి సమీపంలోని మండూరు గ్రామంలో ప్రదర్శించిన 'ఖిల్జీ రాజ్య పతనం' నాటిక కోసం జగ్గయ్య ఆమెను ఎంపిక చేశారు. అందులో గుమ్మడి వెంకటేశ్వరరావు కూడా నటించారు. రంగస్థలంపై జమున చూపిన ప్రతిభే ఆమెకు సినిమా అవకాశాల ద్వారాలు తెరిచింది. బి.వి.రామానందం దర్శకత్వంలో వచ్చిన 'పుట్టిల్లు'తో 1953లో జమున వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య వంటి అగ్ర కథానాయకుల సరసన నటించి తెలుగు చిత్రసీమలో అగ్ర కథానాయికగా ఎదిగారు. జమున సినీ జీవితంలో ఎన్నో పాత్రలు పోషించినా 'సత్యభామ' ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. 'వినాయక చవితి'లో తొలిసారి సత్యభామగా కనిపించిన ఆమె, ఆ తర్వాత 'శ్రీకృష్ణ తులాభారం'లో ఆ పాత్రకు మరింత వన్నె తెచ్చారు. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో రూపొందిన ఆ చిత్రంలో జమున చూపిన అభినయం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. సత్యభామలోని ఆత్మాభిమానం, అలక, ప్రేమ, గాంభీర్యాన్ని తన హావభావాలతో పలికించి ఆ పాత్రకు చిరునామాగా నిలిచారు. 'మిస్సమ్మ', 'ఇల్లరికం', 'ఇలవేల్పు', 'లేత మనసులు', 'గుండమ్మ కథ', 'మూగ మనసులు' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలు ఆమె సినీ ప్రస్థానంలో మైలురాళ్లుగా నిలిచాయి. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, హిందీతో పాటు పలు భాషల్లో నటించి సుమారు 200 చిత్రాలకు చేరువైన సినీ ప్రయాణాన్ని సాగించారు. తెలుగు 'మూగ మనసులు' హిందీ రూపాంతరమైన 'మిలన్'లోనూ ఆమె నటనకు విశేష గుర్తింపు దక్కింది. వెండితెరకే జమున జీవితం పరిమితం కాలేదు. సామాజిక సేవలోనూ చురుగ్గా వ్యవహరించారు. కళాకారుల సంక్షేమం కోసం సంస్థాగతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందిరాగాంధీపై ఉన్న అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చిన జమున కాంగ్రెస్‌లో చేరారు. 1989లో రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికై పార్లమెంటులో అడుగుపెట్టారు. అనంతరం క్రియాశీల రాజకీయాలకు దూరమైన ఆమె కొంతకాలం తర్వాత భారతీయ జనతా పార్టీ తరఫున ప్రచారం చేశారు. సినీ రంగానికి చేసిన సేవలకు అనేక పురస్కారాలు ఆమెను వరించాయి. 'మిలన్' చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ పురస్కారం అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి గౌరవ పురస్కారంతో పాటు ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు తెలుగు



సినీ ప్రేక్షకుల జ్ఞాపకాల్లో నిలిచిన జమున 2023 జనవరి 27న హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె భౌతికంగా దూరమైనా వెండితెరపై సృష్టించిన పాత్రలు మాత్రం సజీవంగానే ఉన్నాయి. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుడు సత్యభామను తలచుకున్న ప్రతిసారీ జమున రూపమే కళ్లముందు కదలాడుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వ్యతిరేకించే ముందు.. విషయం తెలుసుకోండి!

- కాప్ విమర్శలకు అనయా బంగర్ ఘాటు బదులు
- నిబంధనల మేరకే అర్హత పొందానని స్పష్టీకరణ
- ప్రీమియర్ క్రికెట్‌తో పునరాగమనానికి సన్నాహాలు
- భవిష్యత్తులో మహిళల బిగ్‌బాష్ లీగ్ లక్ష్యం
- ఉన్నతస్థాయి క్రికెట్‌కు ఇంకా నిరూపించుకోవాల్సిందే




**సిడ్నీ, ఆగస్టు 29:** మహిళల క్రికెట్‌లోకి తిరిగి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న అనయా బంగర్ తనపై వచ్చిన విమర్శలకు స్పందించింది. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయాన్ని తప్పుబట్టిన దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ మారిజానే కాప్ వ్యాఖ్యలకు బదులిస్తూ.. "వ్యతిరేకించే ముందు పూర్తి వివరాలు తెలుసుకోండి" అని సూచించింది. తనకు ఎలాంటి అనుచిత ప్రయోజనం లేదని, క్రికెట్ ఆస్ట్రేలియా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందుకు సాగుతున్నానని పేర్కొంది. అనయా మహిళల క్రికెట్‌లో ఆడేందుకు అవకాశం కల్పించడంపై ఇటీవల కాప్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయాన్ని ఆమె తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో స్పందించిన అనయా.. తన అర్హతకు సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. ఈ అంశంపై అభిప్రాయం వ్యక్తం చేసేవారు ముందుగా సంబంధిత నిబంధనలు, వివరాలను పూర్తిగా అర్థం చేసుకోవాలని కోరింది. క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి లభించిన అనుమతితో తనకు నేరుగా ప్రొఫెషనల్ జట్టులో చోటు దక్కినట్లు కాదని అనయా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని రాష్ట్ర లేదా టెరిటరీ స్థాయిలో ప్రీమియర్ క్రికెట్ ఆడేందుకు అవకాశం లభించిందని తెలిపింది. కొన్ని స్థానిక క్లబ్‌లతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. భవిష్యత్తులో మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఆడటమే తన ప్రధాన లక్ష్యమని అనయా పేర్కొంది. అయితే అందుకు ముందు క్లబ్ క్రికెట్‌లో రాణించడం, ఫిట్‌నెస్ సాధించడం, తన ఆటతీరుతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించడం అవసరమని తెలిపింది. తన విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం సాధారణ ప్రక్రియలో తీసుకున్నది కాదని అనయా పేర్కొంది. తన వైద్య వివరాలు, శస్త్రచికిత్స చరిత్ర, హార్మోన్, టెస్టోస్టెరాన్ నివేదికలు, క్రికెట్ నేపథ్యం, మ్యాచ్ దృశ్యాలు తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపింది. మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీకి చెందిన క్రీడా సంస్థకు సంబంధించిన శాస్త్రీయ, అథ్లెటిక్ పనితీరు సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొంది. జూలైలో నిర్వహించిన రక్త పరీక్షలో తన మొత్తం టెస్టోస్టెరాన్ స్థాయి లీటరుకు 0.6 నానోమోల్‌గా నమోదైందని వెల్లడించింది. అనయా ఉన్నతస్థాయి క్రికెట్‌లోకి తిరిగి వచ్చే అవకాశం భవిష్యత్తులో అమల్లోకి వచ్చే అర్హత నిబంధనలపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. అప్పటివరకు కమ్యూనిటీ లేదా ప్రీమియర్ స్థాయి క్రికెట్‌లో కొనసాగేందుకు అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల ప్రస్తుత అనుమతిని మహిళల బిగ్‌బాష్ లీగ్ ఒప్పందంగా లేదా ప్రొఫెషనల్, జాతీయ జట్టులో ఎంపికగా భావించకూడదని స్పష్టం చేసింది. తన వ్యక్తిగత ప్రయాణం గురించి కూడా అనయా స్పందించింది. చాలాకాలం పాటు తాను "సర్వైవల్ మోడ్"లో జీవించానని, గతంలో ఎదురైన పరిణామాలను ఇప్పుడు నెమ్మదిగా అర్థం చేసుకుంటూ జీవితాన్ని తిరిగి సర్దుబాటు చేసుకుంటున్నానని పేర్కొంది. ఇకపై ఒక్కో చిన్న అడుగు వేస్తూ తన క్రికెట్ ప్రయాణాన్ని తిరిగి నిర్మించుకోవాలని భావిస్తున్నట్లు తెలిపింది.



# క్రీడాకారులకు మోడీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ క్రీడాభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు. యువతరానికి స్ఫూర్తిగా నిలవడంలో క్రీడల ప్రాధాన్యతను పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రశంసించారు. మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. అలాగే భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. ప్రతి క్రీడాకారుడికి.. మీ అంకితభావం, అభిరుచి, పట్టుదల అందరికీ గర్వకారణం. తరతరాలకు స్ఫూర్తినిచ్చే ప్రతిభావంతుడైన దిగ్గజ మేజర్ ధ్యాన్ చంద్‌కు నివాళులర్పిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. క్రీడలు అంటే కేవలం గెలవడం మాత్రమే కాదని నేనెప్పుడూ నమ్ముతా. కలలు కనడం, కష్టపడటం, ఎదురుదెబ్బలను తట్టుకొని ముందుకు సాగడం నేర్పిస్తాయి. జాతీయ క్రీడాదినోత్సవం నాడు యువతను మరింత ఎక్కువగా గేమ్స్ ఆడేలా ప్రోత్సహిద్దాం క్రికెటర్ శిఖర్ ధావన్ అన్నారు.

# 47 ఏళ్లకు అరంగేట్రం..

## 51 ఏళ్ల వయసులో ప్రపంచ రికార్డు..

### క్రికెట్‌లో 96 ఏళ్ల రికార్డు బద్దలు

**బుకారెస్ట్:** అంతర్జాతీయ క్రికెట్‌లో మరో అరుదైన రికార్డు నమోదైంది. ఐల్ ఆఫ్ మ్యాన్‌కు చెందిన 51 ఏళ్ల స్పిన్నర్ జోయాన్నే హిక్స్ ఏకంగా 96 ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న రికార్డును బద్దలు కొట్టారు. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో ఐదు వికెట్ల ఘనత సాధించిన అత్యంత వయసైన బౌలర్‌గా చరిత్ర సృష్టించారు.



### 51 ఏళ్ల వయసులో అద్భుత బౌలింగ్

రొమేనియాలోని మొయారా వ్లాసియే క్రికెట్ గ్రౌండ్‌లో గ్రీస్ మహిళలతో జరిగిన టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో జోయాన్నే హిక్స్ అద్భుత ప్రదర్శన చేశారు. 51 సంవత్సరాల 173 రోజుల వయసులో బరిలోకి దిగిన ఆమె కేవలం 10 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టారు. ఇది హిక్స్ కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన. అంతేకాకుండా టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఆమెకు ఇది మూడో ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం.

### 5/10తో గ్రీస్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చిన హిక్స్

హిక్స్ స్పిన్ ధాటికి గ్రీస్ బ్యాటింగ్ లైనప్ పూర్తిగా కుప్పకూలింది. ఆమె ఐదు వికెట్లు తీసుకోవడంతో గ్రీస్ జట్టు కేవలం 15 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం 53 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టుకు పవర్‌ప్లే సమయం కూడా పూర్తిగా అవసరం కాలేదు. కేవలం తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో హిక్స్ వ్యక్తిగత రికార్డుతో పాటు జట్టు విజయానికి కూడా కీలకంగా మారారు.

### 96 ఏళ్లుగా ఉన్న బెర్ట్ ఐరన్‌మోంగర్ రికార్డు బద్దలు

జోయాన్నే హిక్స్ సాధించిన ఘనతతో 96 ఏళ్ల క్రితం నమోదైన రికార్డు తెరమరుగైంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వయసులో ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా ఇంతకాలం ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ బెర్ట్ ఐరన్‌మోంగర్ పేరు మీద రికార్డు ఉంది. 1932లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఐరన్‌మోంగర్ 49 సంవత్సరాల 314 రోజుల వయసులో ఐదు వికెట్ల ఘనత సాధించారు. ఇప్పుడు 51 సంవత్సరాల 173 రోజుల వయసులో హిక్స్ ఐదు వికెట్లు తీసి ఆ రికార్డును అధిగమించారు.

### ఒకే రోజు ఐరన్‌మోంగర్ రెండు ఫైవ్ వికెట్ల హాల్స్

1932లో దక్షిణాఫ్రికాతో జరిగిన ఆ మ్యాచ్‌లో బెర్ట్ ఐరన్‌మోంగర్ అద్భుత ప్రదర్శన చేశారు. ఒకే రోజు రెండు ఇన్నింగ్స్‌లలోనూ 5వికెట్లకు పైగా తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో 6పరుగులకు 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 18 పరుగులకు 6 వికెట్లు పడగొట్టారు. ఆ మ్యాచ్‌లో దక్షి ణాఫ్రికా 36, 45 పరుగులకే ఆలౌట్ కాగా, ఆస్ట్రేలియా 153 పరుగులు చేసి ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించింది.

### 47 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం

జోయాన్నే హిక్స్ అంతర్జాతీయ కెరీర్ కూడా ఎంతో ప్రత్యేకమైనది. ఆమె ఏకంగా 47 ఏళ్ల వయసులో ఐల్ ఆఫ్ మ్యాన్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. 2024లో గ్రీస్, మాల్టాతో జరిగిన మ్యాచ్‌ల్లో ఆరు రోజుల వ్యవధిలోనే రెండు ఐదు వికెట్ల ఘనతలు సాధించారు. మాల్టాపై ఐదు వికెట్లు తీసినప్పుడు ఆమె వయసు 49 సంవత్సరాల 168 రోజులు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో ఐదు వికెట్లు తీసిన అత్యంత వయసైన మహిళా బౌలర్‌గా అప్పట్లో రికార్డు సృష్టించారు.

### ఇప్పుడు మహిళల రికార్డును దాటి ప్రపంచ రికార్డు

తాజా ప్రదర్శనతో హిక్స్ మరో మెట్టు ఎక్కారు. ఇప్పటివరకు మహిళల విభాగంలో మాత్రమే ఉన్న ఆమె రికార్డు.. ఇప్పుడు పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వయసులో ఐదు వికెట్లు సాధించిన బౌలర్‌గా మారింది. కేవలం 10 పరుగులకే ఐదు వికెట్లు తీసి గ్రీస్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చడంతో పాటు, ఐల్ ఆఫ్ మ్యాన్‌కు ఘన విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారు. 51 ఏళ్ల వయసులో జోయాన్నే హిక్స్ సాధించిన ఈ ఘనత అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది.

# 7 పరుగులకే ఆలౌట్

## ఇదేం బ్యాటింగ్ బాబోయ్!

### టీ20 చరిత్రలో అత్యల్ప స్కోర్లివే

### 10 పరుగులకే కుప్పకూలిన రెండు జట్లు

### చెత్త రికార్డులో ఐవరీ కోస్ట్ అగ్రస్థానం

### మంగోలియా ఖాతాలోనూ రెండు దారుణ స్కోర్లు

స్పోర్ట్స్ డెస్క్: టీ20 క్రికెట్ అంటేనే ధనాధన్ సిక్సర్లు.. ఫోర్ల వర్షం.. మెరుపు అర్ధశతకాలు. బ్యాటర్లు బౌలర్లపై విరుచుకుపడి భారీ స్కోర్లు సాధించడం ఈ పొట్టి ఫార్మాట్‌లో సర్వసాధారణం. కానీ కొన్నిసార్లు పరిస్థితి పూర్తిగా తలకిందులవుతుంది. భారీ షాట్లు కొట్టేందుకు బరిలోకి దిగిన బ్యాటర్లు కనీసం క్రీజులో నిలబడలేక ఒక్కొక్కరుగా పెవిలియన్‌కు క్యూ కట్టిన సందర్భాలూ ఉన్నాయి. అంతర్జాతీయ టీ20 చరిత్రలో కొన్ని జట్లు కనీసం రెండంకెల స్కోరును కూడా అందుకోలేక అత్యంత దారుణ రికార్డులను మూటగట్టుకున్నాయి. ఈ అవాంఛనీయ రికార్డులో ఐవరీ కోస్ట్ అగ్రస్థానంలో ఉంది. 2024 నవంబర్ 24న నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య ఛేదనకు దిగిన ఐవరీ కోస్ట్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. ప్రత్యర్థి బౌలర్ల ధాటికి కేవలం 7.3 ఓవర్లలోనే 7 పరుగులకు ఆలౌటయ్యారు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యల్ప జట్టు స్కోరుగా ఇది నమోదైంది. రెండో అత్యల్ప స్కోరు రికార్డును మంగోలియా, ఐల్ ఆఫ్ మ్యాన్ పంచుకున్నాయి. 2024 సెప్టెంబర్ 5న సింగపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మంగోలియా.. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఎదుర్కోలేక 10 ఓవర్లలో 10 పరుగులకే ఆలౌటైంది. 2023 ఫిబ్రవరి 26న స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐల్ ఆఫ్ మ్యాన్ పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. స్పెయిన్ బౌలర్ల ధాటికి 8.4 ఓవర్లలో 10 పరుగులకే కుప్పకూలింది. ఆ స్వల్ప లక్ష్యాన్ని స్పెయిన్ సునాయాసంగా ఛేదించింది. ఈ జాబితాలో మంగోలియా మరోసారి చోటు దక్కించుకుంది. 2024 మే 8న జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 8.2 ఓవర్లలోనే 12 పరుగులకు ఆలౌటైంది. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో అత్యల్ప స్కోర్ల జాబితాలో మంగోలియా పేరు రెండుసార్లు నమోదైంది. ఐవరీ కోస్ట్ కూడా మరోసారి ఈ అవాంఛనీయ జాబితాలో చేరింది. 2026 మే 24న రువాండాతో జరిగిన మ్యాచ్‌లో 15.2 ఓవర్ల పాటు క్రీజులో ఉన్నప్పటికీ 17 పరుగులకే ఆలౌటైంది. దీంతో రువాండా ఏకపక్ష విజయాన్ని అందుకుంది. సిక్సర్లు, ఫోర్లతో పరుగుల వరద పారే టీ20 క్రికెట్‌లో 7, 10, 12, 17 పరుగులకే జట్లు కుప్పకూలడం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసే అంశమే. పొట్టి ఫార్మాట్‌లో ఒక్క చెత్త రోజు ఎదురైతే ఎంతటి దారుణ రికార్డు ఖాతాలో చేరుతుందో ఈ స్కోర్లే చెబుతున్నాయి.



# ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్

## ప్రాక్టీస్‌లో గాయంతో నీరజ్ చోప్రా పోటీలకు దూరం





**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు. ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది' అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ÷నైల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అ÷-లథెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

# 'కింగ్100'.. గ్లింప్స్ రిలీజ్

కింగ్ నాగార్జున ప్రస్తుతం తన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంలో నటిస్తున్నారు. #King100 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందిస్తున్నారు. రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో ఆయన తెలుగులో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఆగస్టు 29న నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. తమ అభిమాన హీరో 100వ సినిమాకు ఎలాంటి టైటిల్ పెట్టబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఈ చిత్రంలో నటి టబు కీలక పాత్రలో నటిస్తున్నారు. 'నిన్నే పెళ్లాడతా', 'ఆవిడ మా ఆవిడే' వంటి చిత్రాల్లో నాగార్జునతో కలిసి నటించిన టబు.. చాలా కాలం తర్వాత మరోసారి ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం సినిమాపై అంచనాలను పెంచుతోంది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్‌తో పాటు సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను కూడా మేకర్స్ వెల్లడించనున్నారు. నాగార్జున పుట్టినరోజుకు మరో మూడు రోజులు మాత్రమే ఉండటంతో #King100 టైటిల్ గ్లింప్స్‌పై ఆసక్తి మరింత పెరుగుతోంది.





# ఆదర్శ కుటుంబంలో హిట్ సాంగ్ రీమిక్స్?

మన టాలీవుడ్ మోస్ట్ లవబుల్ హీరోస్ లో ఒకరైన విక్టరీ వెంకటేష్ హీరోగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న అవైటెడ్ సినిమా 'ఆదర్శ కుటుంబం' కోసం అందరికీ తెలిసిందే. ఫ్యామిలీ ఆడియెన్స్ లో మంచి బజ్ ఉన్న ఈ చిత్రం దాదాపు పూర్తి కావస్తుంది. అయితే ఈ సినిమా విషయంలో ఓ ఇంట్రెస్టింగ్ రూమర్ సినీ వర్గాల్లో వైరల్ గా మారింది. దర్శకుడు త్రివిక్రమ్ ఓ అందమైన సందర్భం క్రియేట్ కి వెంకీ మామ కెరీర్ లో సూపర్ హిట్టయిన సాంగ్స్ లో ఒకటి రీమిక్స్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. అదే తన కూలీ నెంబర్ 1 సినిమా నుంచి ఇళయరాజా స్వరపరిచిన చార్ట్ బస్టర్ సాంగ్ దండాలయ్యా ఉండ్రాళ్ళయ్య అట. దీనికి థమన్ రీమిక్స్ వెర్షన్ ని క్రియేట్ చేస్తున్నట్టుగా ఇప్పుడు టాక్. సో దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రాన్ని హారికా హాసిని వారు నిర్మాణం వహిస్తుండగా ఈ అక్టోబర్ 2న సినిమా గ్రాండ్ గా విడుదలకి రాబోతుంది.

# యశ్ డేరింగ్ అటెంప్ట్‌తో నేనున్నాను..!



కన్నడ సినిమా నుంచి తాజాగా వచ్చిన గ్లోబల్ లెవెల్ ప్రాజెక్ట్ నే 'టాక్సిక్'. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తో చేసిన ఈ ప్రయోగాత్మక భారీ చిత్రం అనుకున్న రేంజ్ స్పందన ఆడియెన్స్ నుంచి అందుకోలేదు. రెండో రోజు నుంచే భారీగా డ్రాప్ చూసిన 'టాక్సిక్' పై తాజాగా కన్నడ స్టార్ నటుడు కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి ఈ సినిమా విషయంలో యశ్ తో తోడుగా నిలబడుతున్నాను అని చెప్పుకొచ్చారు. తన ఇన్స్టాగ్రామ్ స్టోరీలో టాక్సిక్ సబ్జెక్టు కోసం ఇంట్రెస్టింగ్ కామెంట్స్ తాను చేశారు. టాక్సిక్ లాంటి సినిమా ప్రయాణంలో కథ, కొన్ని పాత్రలు అనుకున్నట్టుగా ప్రయాణించకపోవచ్చు అలాగని సినిమా నడిచే ట్రాక్ తప్పు కాదని సూచించారు.ఒక నటుడుగా ఒక పాత్రని పోషిస్తున్నపుడు దానిని హృదయం లోతుల్లోనుంచి ఆవిష్కరించేందుకు ఎంత నిబద్ధత కావాలో నాకు తెలుసు ఆ నిబద్ధత చూసి నేను ముగ్దున్ని అయ్యానని రిషబ్ తెలిపారు. యష్ సార్ ఒక లార్జర్ దన్ లైఫ్ నటనను డిమాండ్ చేసే ఒక పాత్రకు, ఆ ప్రపంచానికి మిమ్మల్ని మీరు మార్చుకున్న విధానానికి హ్యాట్సాఫ్. ప్రతి ఒక్క సన్నివేశంలోనూ నేను దానిని స్పష్టంగా అనుభూతి చెందాను అని తెలిపారు. అలాగే టాక్సిక్ చిత్రంలో చెప్పాలనుకున్న గిల్ట్ పాయింట్ మనిషి జీవితంలో టాక్సిసిటీ ఎలా పెంచుతుంది అనే ప్రయోగాత్మక డేరింగ్ స్టెప్ ని మీరు అటెంప్ట్ చేయడం మామూలు విషయం కాదు. ఈ ప్రయత్నానికి నేను మీతో అండగా నేను నిలబడతాను.




# యేశనాగులకి డోస్ సరిపోలేదా?

నాచురల్ స్టార్ నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో చేస్తున్న అవైటెడ్ చిత్రమే 'ది ప్యారడైజ్'. భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం దాదాపు పూర్తి కావస్తుండగా మేకర్స్ ఈ సినిమా నుంచి అవైటెడ్ రెండో సాంగ్ యేశనాగులని విడుదల చేశారు. అయితే ఈ సాంగ్ విడుదలకి ముందే ఏ రేంజ్ లో ఉంటుంది అనేది అందరిలో అందరిలో ఓ క్లారిటీ ఉంది. అయితే మొదట ఆడియో వెర్షన్ ని విడుదల చేసి తర్వాత వీడియో లిరికల్ ని విడుదల చేశారు మేకర్స్. కానీ ఈ వెర్షన్ కి అనూహ్యంగా వేరే ఫీడ్ బ్యాక్ ఆడియెన్స్, నెటిజన్స్ నుంచి వస్తుండడం గమనార్హం. ముఖ్యంగా సాంగ్ కొరియోగ్రఫీ విషయంలో ఫీడ్ బ్యాక్ తేడాగా ఉంది. ఆట సందీప్ ఈ సాంగ్ కి నృత్య సహకారం అందించారు. అయితే ఈ సాంగ్ బీట్స్ కి తగ్గ రేంజ్ లో స్టెప్పులు లేవనేది ఆడియెన్స్ మాట. ఆ బీట్స్ కి ఫాస్ట్ గా లేకుండా సింపుల్ గా ఉండడంతో ఈ డోస్ సరిపోలేదని అంటున్నారు. ఇప్పడైతే చెయ్యడానికి ఏమీ లేదు. సో ఈ సాంగ్ అలవాటు అవుతుందో లేక మేకర్స్ ఏమన్నా మ్యాజిక్ చేస్తారేమో చూడాలి. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందించగా ఎస్ ఎల్ వి సినిమాస్ నిర్మాణం వహించారు.

# ఓటిటిలోకి డిసి!

తమిళ స్టార్ దర్శకుడు ఇప్పుడు హీరోగా మారిన లోకేష్ కనగరాజ్ నుంచి వచ్చిన లేటెస్ట్ చిత్రం 'డిసి' కోసం అందరికీ తెలిసిందే. తెలుగు, తమిళ్ లో భారీ హిట్ గా నిలిచిన ఈ సినిమాతో హీరోగా లోకేష్ కనగరాజ్ క్రేజీ వెల్కమ్ అందుకున్నాడు. ఇక ఈ సినిమా థియేటర్స్ లో సాలిడ్ రన్ ని కంటిన్యూ చేసి ఎట్టకేలకి ఇప్పుడు ఓటిటి రిలీజ్ కి సిద్ధం అయ్యింది. ఈ చిత్రాన్ని ఒకటి కాదు రెండు ఓటిటి ప్లాట్ ఫామ్ లు స్ట్రీమింగ్ కి తీసుకొస్తాయి అని టాక్ వినిపించిన నేపథ్యంలో వీటిలో ఒకటి అధికారిక అనౌన్సమెంట్ ని ఇచ్చేసింది. సన్ నెక్స్ట్ వారు డిసి చిత్రాన్ని అనధికారికంగా వినిపించిన డేట్ సెప్టెంబర్ 4 నుంచే అందుబాటులోకి తెస్తున్నట్టుగా ఖరారు చేశారు. అయితే ఇందులో కేవలం తమిళ్ లోనే రావచ్చని మొదట వినిపించింది కానీ ట్విస్ట్ ఇస్తూ వీరు తమిళ్ తో పాటుగా తెలుగు, ఇంకా మలయాళం భాషల్లో కూడా ఈ చిత్రాన్ని తెస్తున్నట్టు తెలిపారు. సో ఈ డేట్ వరకు ఫ్యాన్స్ ఆగితే సరిపోతుంది. అలాగే ప్రైమ్ వీడియో వారి నుంచి అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందించగా సన్ పిక్చర్స్ నిర్మాణం వహించారు.



Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644



# హాస్యం పండించడంలో సాటి లేని మేటి భమిడిపాటి

## నేడు హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు వర్ధంతి

హాస్య చమత్కార యుక్త మాటలు, సంభాషణలు, రచనల కోసం జీవితాంతం తపించి, తపస్సు చేసి సిద్ధి పొందిన తాపసి భమిడిపాటి కామేశ్వర రావు. వాస్తవానికి ఆయన హాస్య సృష్టి కర్త. అందుకే హాస్య బ్రహ్మగా గుర్తింపు పొందారు. భమిడిపాటి కామేశ్వరరావు (ఏప్రిల్ 28, 1897 – ఆగష్టు 28, 1958) రచయిత, నటుడు, నాటక కర్త. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఏప్రిల్ 28, 1897 సంవత్సరంలో నరసావ ధానులు, లచ్చుమ్మ దంపతుల కు జన్మించారు. వీరు భీమవరం లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ప్రతిభావంతులైన విద్యార్థుల కిచ్చే ఉపకార వేతనం సహాయంతో, పిఠాపురం మహారాజా కళాశాలలో గణితంలో పట్టా పొందారు. తరువాత కొంత కాలం నరసాపురం, కాకినాడ లలో ఉపాధ్యాయునిగా పని చేశారు. 1922లో ఎల్.టి పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రి వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర అధ్యాపక పదవిలో స్థిరపడి, అదే పాఠశాలకు రెండు సంవత్సరాలు ప్రధానోపా ధ్యాయ బాధ్యతలను కూడా నిర్వహించారు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ వీరు చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను తమ రచనలలో హాస్యరసాను రంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి కావడం హాస్య బ్రహ్మ అని కొనియాడ బడ్డారు. త్యాగరాజు రచనలను, జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ, వాద్యాలను ఆ గాయకుని భావానికి అనుగుణంగా సమకూర్చుకుని 'త్యాగరాజు ఆత్మ విచారం' రచన చేశారు. తన అభిప్రాయాలకు అనుగుణంగా రచించిన తమ నాటకాలను రాజమండ్రి కళాశాల వార్షికోత్సవాలలో ఆయనే దర్శకత్వం వహించి ప్రదర్శించే వారు. ఆయన స్వయంగా నటులు కూడా. ద్విజేంద్రలాల్ రచించిన 'చంద్రగుప్త'లో శక్తి సింహ పాత్ర పోషణ ద్వారా ఖ్యాతిని పొందారు. కామేశ్వర రావు ఎక్కువగా నాటికలు ముఖ్యంగా హాస్య ప్రధానమైన రచనలు గావించారు. ఆయన నాటికలకు చాలాభాగం ఫ్రెంచి నాటక కర్త మోలియర్ వ్రాసిన నాటికలు ఆధారం. ఆయన అనేక విషయాల మీద వ్రాసిన వ్యాసాలు 20వ శతాబ్దపు మొదటి అర్ధ భాగము లోని సామాజిక పరిస్థితులను తెలియ చేస్తాయి. ఆయన హాస్యం చదువరికి చురుక్కు మనిపిస్తుంది. ఆయన ఉత్తమ మైన హాస్య రచనలతో ఎందరినో మనసారా నవ్వించిన 1958, ఆగష్టు 28 న పరమ పదించారు. భమిడిపాటి కామేశ్వర రావు అనేక హాస్య రచనల నుండి కొన్ని హాస్య పూరకమై, ఈనాటికి సందర్భ సందర్భో చితంగా ఉండేవి .....వాటిల్లో కొన్ని తీసుకుంటే.. మన తెలుగు వ్యాసం నుండి......నూటికి నూరుమంది పైచిలుకు మాట్లాడే తెలుగు కలగాపులగమే. ఈ పులగంలో సంస్కృతం, పార్శీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగు యొక్క మెత్తదనం వల్లనే ఇన్నిన్ని భాషల పదాలు బాణాల్లాగ హృదయంలో నాటే లాగ తెలుగులో గుచ్చుకుని ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిల్చి ఉండనిస్తే అవి సెలలు వేసి ప్రాణం తీసేస్తాయ ని కొందరూ, లేక వాటిని పైకి లాగిపారేస్తే వెంటనే ప్రాణం పోకట అని కొందరూ. పరీక్షలు వ్యాసం నుండి...పరీక్షల కోసం, మార్కుల కోసం మాత్రమే బాధపడే వాడికి, విద్య అంటదు. విద్యకోసం పాటుపడే వాడికి పరీక్షవల్ల బాధే ఉండదు. ...జీవితం ఒక పెద్ద నిత్య పరీక్ష. జీవిత పరీక్షకి ఎప్పుడో తయా రు అవుతానులే అనడం కాక, అప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడి విధి. పాలక సంఘాల్లో ఎన్నికల మజా అన్న వ్యాసం నుండి... జనం పంపిన మీదట పాలక సంఘంలోకి వెళ్ళి, వెంటనే ఆ జనాన్ని మరచి పోడమే ఎన్నికల్లో మజా; ఒకవేళ జ్ఞాపకం ఉంచుకున్నా, ఆ జనుల్లో మొదటి జనుడు తనేగదా అనుకోడం మరీ మజా. ఒకడు పాడు పన్లు చేస్తూ వుంటే, మనం కూడా, నెగ్గా లంటే, అంతకంటే పాడుపన్లు చెయ్యవలసి వచ్చేది ఎన్నిక ల్లోనే. ఎన్నికల నిఘంటువులో అసత్యం అధర్మం, అన్యాయం, ద్రోహం క్రౌర్యం, దారుణం లాంటి మాటలుండవు. గొంతు కేన్సర్ తో జీవిత చరమాంకంలో ఇంట్లో మంచం లో పడివున్న భమిడి పాటిని చూసేందుకు వచ్చిన బంధువు లు, మిత్రులకు ఆయన ఉ న్న పరిస్థితి చూసి కళ్ళవెంట నీళ్ళు వచ్చే సందర్భంలో, అంత బాధలో కూడా "అరే, అప్పుడే ఏడుస్తా రెందుకు... ఆ కన్నీళ్ళకు ఇంకా కొంత సమయం ఉంది" అనే వారంటే భమిడిపాటి హాస్య చమత్కార ప్రియత్వం అర్థం అవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రాఖీ.. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి పండుగ

- శ్రావణ పౌర్ణమికి ఎన్నో విశిష్టతలు
- జంధ్యాల పౌర్ణమి.. నారికేళ పూర్ణిమగానూ ప్రాచుర్యం
- ఉపాకర్మతో వేదాధ్యయనానికి శ్రీకారం
- సోదరుడి క్షేమం కోరుతూ సోదరి కట్టే రక్షాబంధనం
- పురాణ కాలం నుంచి కొనసాగుతున్న పవిత్ర సంప్రదాయం



శ్రావణ పౌర్ణమి అంటే కేవలం రాఖీ పండుగ మాత్రమే కాదు. ఆధ్యాత్మికత, కుటుంబ అనుబంధాలు, వేద సంప్రదాయాలు మేళవించిన విశిష్ట పర్వదినం. హయగ్రీవ జయంతిగా, జంధ్యాల పౌర్ణమిగా, రాఖీ పౌర్ణమిగా, నారికేళ పూర్ణిమగా వివిధ ప్రాంతాల్లో ఈ పర్వదినం ప్రసిద్ధి చెందింది. ప్రాంతాన్ని బట్టి ఆచారాలు మారినా.. రక్షణ, శ్రేయస్సు, అనుబంధం అనే భావనలే ఈ పండుగలో అంతర్లీనంగా కనిపిస్తాయి. వర్షాకాలం రాకను స్వాగతిస్తూ మధుర పదార్థాలను స్వీకరించడం కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయం. వరుణ దేవుడి అనుగ్రహం కోసం కొబ్బరికాయలను సమర్పించే ఆచారం కారణంగా దీనికి 'నారికేళ పూర్ణిమ' అనే పేరు వచ్చింది. ముంబయి సహా పశ్చిమ తీర ప్రాంతాల్లో ఈ రోజున సముద్రాన్ని పూజించి వరుణ దేవుడి కరుణ కోరడం ఆనవాయితీ. పూర్వకాలంలో సముద్రయానాలు, వర్తక కార్యకలాపాలకు కూడా ఈ పర్వదినానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండేది.

### జంధ్యాల పౌర్ణమిగా ప్రత్యేకత

శ్రావణ పౌర్ణమికి వేద సంప్రదాయంలోనూ విశిష్ట స్థానం ఉంది. పూర్వకాలంలో ఉపాకర్మ అనంతరం వేదాధ్యయనాన్ని ప్రారంభించేవారు. ఉపాకర్మ అనేది కేవలం పండుగ కాకుండా వేదాధ్యయనానికి



సంబంధించిన ముఖ్యమైన వైదిక కర్మగా భావిస్తారు. యజ్ఞోపవీతంలోని మూడు పోచలకు ఆధ్యాత్మికంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సృష్టి, స్థితి, లయలకు ప్రతీకలైన త్రిమూర్తులను అవి సూచిస్తాయని సంప్రదాయ విశ్వాసం. జంధ్యాల పౌర్ణమి రోజున యజ్ఞోపవీతాన్ని మార్చుకొని వైదిక కర్మలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఋషులను స్మరించుకుంటూ ఋషి పూజలు, ఋషి తర్పణాలు నిర్వహిస్తారు. గౌతమ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ఠ, కశ్యప, అత్రి మహర్షులను సప్తర్షులుగా పేర్కొనే సంప్రదాయం ఉంది. ఇతర పురాణ గ్రంథాల్లో సప్తర్షుల జాబితాలో భిన్నమైన పేర్లు కూడా కనిపిస్తాయి. యజుర్వేద సంప్రదాయంలో పౌర్ణమి తిథికి, రుగ్వేద సంప్రదాయంలో శ్రవణ నక్షత్రానికి, సామవేద సంప్రదాయంలో హస్త నక్షత్రానికి ఉపాకర్మలో ప్రాధాన్యం ఉన్నట్లు వైదిక సంప్రదాయాలు పేర్కొంటాయి.

### రాఖీ.. ఓ దారమే కాదు

శ్రావణ పౌర్ణమికి ప్రజల్లో అత్యంత ప్రాచుర్యం తెచ్చింది రక్షాబంధనం. సోదరి తన సోదరుడి ముంజేతికి రాఖీ కట్టి అతడి ఆయురారోగ్యాలు, శ్రేయస్సును కోరుతుంది. సోదరుడు తన సోదరికి జీవితాంతం అండగా ఉంటాననే భావనను వ్యక్తం చేస్తాడు. అందుకే రాఖీ కేవలం రంగురంగుల దారం కాదు.. సోదరీసోదరుల మధ్య ప్రేమ, నమ్మకం, బాధ్యతలకు ప్రతీకగా నిలుస్తోంది. రాఖీని పట్టు లేదా నూలు దారాలతో తయారు చేయడం పూర్వపు సంప్రదాయం. కాలక్రమంలో అది రంగురంగుల అలంకరణలతో ఆభరణాన్ని తలపించేలా మారింది. సోదరుడికి బొట్టు పెట్టి, హారతి ఇచ్చి, రాఖీ కట్టడం.. అనంతరం సోదరుడు సోదరికి కానుక అందించడం సంప్రదాయంగా కొనసాగుతోంది.

### పురాణాల్లోనూ రక్షాబంధనం

రక్షాబంధనానికి సంబంధించి పురాణాల్లో పలు కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ధర్మరాజు శ్రీకృష్ణుడిని రక్షణకు మార్గం అడిగినప్పుడు రక్షాబంధన విధిని వివరించినట్లు ఒక కథనం చెబుతుంది. దేవాసుర సంగ్రామ సమయంలో ఇంద్రాణి ఇంద్రుడికి రక్షను కట్టి విజయాన్ని ఆకాంక్షించిన కథ కూడా రక్షాబంధన ప్రాశస్త్యంతో ముడిపడి ఉంది. కాలక్రమంలో రక్షాబంధనం సోదరీసోదరుల అనుబంధానికి ప్రధాన చిహ్నంగా మారింది. రక్తసంబంధం లేకపోయినా ఒక మహిళ పురుషుడికి రాఖీ కట్టి సోదర భావాన్ని వ్యక్తం చేసే సంప్రదాయం కూడా ఏర్పడింది. రాఖీ స్వీకరించిన వ్యక్తి ఆమెకు అండగా, రక్షకుడిగా ఉండాలన్న భావన దీనిలో కనిపిస్తుంది.

### అనుబంధాలకు అక్షయ తోరణం

కాలం మారింది.. జీవన విధానాలు మారాయి.. కుటుంబాలు ప్రపంచంలోని విభిన్న ప్రాంతాలకు విస్తరించాయి. కానీ రాఖీ కట్టే చేతిలోని ఆప్యాయత మాత్రం మారలేదు. చిన్న తోరంతో మొదలయ్యే ఈ వేడుక సోదరీసోదరుల మధ్య జీవితకాల అనుబంధాన్ని గుర్తుచేస్తుంది. అందుకే రాఖీ అంటే చేతికి కట్టే దారం మాత్రమే కాదు.. 'నీకు నేనున్నా' అని ఇచ్చే భరోసా. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి చిరునామా.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వేదోద్ధరణ అవతారమే హయగ్రీవుడు

"జ్ఞానానందమయం దేవం, నిర్మలం స్ఫటికాకృతిం, ఆధారం సర్వ విద్యానాం హయగ్రీవ ముపాస్మహే" పురాణేతిహాసాలలో ప్రసిద్ధములైన విష్ణువు అవతారాలలో హయగ్రీవావతారం ఒకటి. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం శ్రీహరి దాల్చిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. సమస్త విద్యలను, జ్ఞానాన్ని పాండిత్యాన్ని అనుగ్రహించే శ్రీ గురుమూర్తి హయగ్రీవ స్వామి. వేదోద్ధరణకై సంభవించిన అవతారమే ఇది. మధుకైటభులు అనే రాక్షసులు వేదాలను దొంగిలిస్తే, విష్ణుమూర్తి హయగ్రీవ అవతారాన్ని ధరించి, ఆ మధుకైటభులను వధించి...వేదాలను రక్షించాడు. హిందూమతంలో, హయగ్రీవ స్వామిని కూడా విష్ణుమూర్తి అవతారముగా భావిస్తారు. గుఱ్ఱపుముఖంతో, నరశరీరంతో, చతుర్భుజుడై శంఖచక్రాలను ధరించి వామాంకంలో లక్ష్మీదేవి సహితంగా ఆవిర్భవించిన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే హయగ్రీవ స్వామి. ఆయనలో సకల దేవతలూ కొలువై ఉన్నారని పురాణాలు పేర్కొంటున్నాయి. సూర్యచంద్రులు కళ్ళుగా, దేవతలు ఎముకలుగా, అష్టవసువులు పాదాలుగా, అగ్ని నాలుకగా, సత్యం వాక్కుగా, బ్రహ్మ హృదయంగా... ఇలా ఆయనలోని అణువణువూ దేవతామయమని అంటారు. హయగ్రీవున్ని జ్ఞానమునకు, వివేకమునకు, వాక్కుకు, బుద్ధికి, అన్ని విద్యలకు దేవుడుగా భావిస్తారు. హయగ్రీవ స్వామిని చదువుల యొక్క దేవుడుగా పూజిస్తారు. జ్ఞానం, వాక్కు, ఆచారము నాశనం కాకుండా సాగునట్లు అనుగ్రహించిన హయగ్రీవ మూర్తిగా శ్రావణ పూర్ణిమ నాడు మహా విష్ణువును కొలవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. హయగ్రీవుడనగా గుఱ్ఱం శిరస్సు, మానవ దేహం కలిగిన స్వామి, నరసింహ స్వరూపం వలే వైకుంఠ నాథుడు హయగ్రీవ ధారియైనారు. 'హయ' అనగా విజ్ఞానం . 'గ్రీవ' అనగా కంఠం. అన్ని విద్యలూ కంఠస్థమై ఉన్న సర్వ విద్యా రూపమే హయగ్రీవ మూర్తి. భాగవతంలో సప్తమ స్కంధంలో హయగ్రీవుడు బ్రహ్మ చేసిన యజ్ఞంలో ఆవిర్భవించినట్లు, స్కంద పురాణంలో దేవతల ప్రార్థనలతో విష్ణువు అశ్వముఖులై అవతరించినట్లు, పూర్వగాథాలహరి లోనూ హయగ్రీవ వృత్తాంతాలు పేర్కొనబడినాయి. దేవీ భాగవతం ప్రకారం ఒకానొక సమయాన మహావిష్ణువు రాక్షసులతో పదివేల ఏళ్ళు భీకర యుద్ధం చేసి అలసి పోయి, అల్లెత్రాడు గట్టిగా బిగించి ఉన్న ధనుస్సును నేలమీద నిలబెట్టి, దాని కోపుమీద తమ గడ్డాన్ని ఆనించి. నిలబడే నిద్ర పోయారు. విషయము వెదకుతూ



వచ్చిన దేవతలు, నిద్ర లేపడానికి భయపడి, బ్రహ్మ దేవుడు ఒక చెద పురుగును సృష్టించి, వింటి నారిని కొరకమని చెబుతారు. పురుగు కొరకడంతో ధనుస్సు విసురుగా తుళ్ళి, వింటికి ఉన్న బాణం కొన విష్ణువు మెడకు తగిలి, ఆయన శిరస్సు తెగి, ఎగిరి పోయింది. దేవతలంతా మహాదేవిని ప్రార్థించగా, ఆమె ప్రత్యక్షమై సూచించిన విధంగా గుఱ్రాన్ని వధించి, దాని తలను తెచ్చి దేవశిల్పి యైన త్వష్ట ద్వారా విష్ణువు మొండానికి అతికించారు. బ్రహ్మ ప్రాణం పోయగా, హయగ్రీవులైనారు. సృష్టి ఆరంభంలో అగణిత ఏళ్ళ క్రింద చతుర్ముఖ బ్రహ్మకు కు పరమాత్మ వేదశాస్త్రాలను బోధించారు. మధుకైటభులనే ఇరువురు అసురులు, బ్రహ్మ నుండి వేద విద్యను దొంగిలించి, రసాతలానికి పారి పోయారు. హయగ్రీవ రూపంలోని శక్తితో మాత్రమే తాను మరణించునట్లు, హయగ్రీవుడనే రాక్షసుడు, బ్రహ్మ ద్వారా పొందిన వరం కారణంగా, దేవి కృప వల్ల హయగ్రీవ అవతారులైన విష్ణు అదే పేరుగలిగిన అసుర సంహారం చేయడం జరిగింది. తాను చంద్రమండల వాసియైన హయగ్రీవుడు, మహానంద స్వరూపుడు, ఆయన నాసిక నుండి వేదాలు ఆవిర్భవించాయని పురాణ కథనం. హయగ్రీవ విరాట్ స్వరూపాన సత్యలోకం శిరస్సుగా, భూలోకం నాభిగా, పాతాళం పాదాలుగా, అంతరిక్షం కళ్ళుగా, సూర్యుడు కంటి గుడ్లుగా, చంద్రుడు గుండెగా, దిక్పాల కులు భుజాలుగా, అగ్ని ముఖంగా, సముద్రాలు ఉదరంగా, నదులు నదులు, పర్వతాలు ఎముకలు, మేఘాలు కేశాలుగా, సర్వ దేవతా స్వరూపులైనారు. హయగ్రీవుడు తెల్లని శరీరం కలవాడు. లక్ష్మీదేవిని తొడపై కూర్చోబెట్టుకుని, తెల్లని పద్మాసీనులై ఉంటారు. కుడిచేతిలో చక్రం, పై ఎడమ చేతిలో శంఖం, కింది ఎడమ చేతిలో పుస్తకం, కింది కుడిచేయి చిన్ముద్ర ధరించి ఉంటారు. శ్వేతపద్మం సమస్త ఐశ్వర్యాలకు చిహ్నం. చిన్ముద్ర జ్ఞానానికి, పుస్తకం సకల విద్యలకు, శంఖం సకల సృష్టికి కారణభూతమైన నాదానికి, చక్రం అజ్ఞాన సంహారానికి చిహ్నాలు. హయగ్రీవుని ఉపాసించిన వారికి సకలం కలుగుతాయని విశ్వాసం. ఏ దేవతకైనా నామమే శరీరమని, ఆ నామంలోని అక్షరాలే అవయవాలని శాస్త్రవచనం. అందుకే వైష్ణవులకు ఆధ్యాత్మిక విద్యాభ్యాసం హయగ్రీవ నామోపదేశంతో ప్రారంభించడం సంప్రదాయం. హయగ్రీవ నామాన్ని ఉచ్చరించే వారు శివస్వరూపులుగా, పలికిన వారు విష్ణు స్వరూపులుగా, విన్నవారు బ్రహ్మ స్వరూపులుగా అవుతారని బ్రహ్మ చెప్పడాన్ని బట్టి హయగ్రీవ నామ ప్రాధాన్యత స్పష్టం అవుతుంది. భారతావనిలో చాలా చోట్ల హయగ్రీవ ఆలయాలు ఉన్నాయి. హయగ్రీవుని విశాల ఆలయం అస్సాంలో ఉంది. తిరుమల శ్రీహరి ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో శ్రీ లక్ష్మీహయగ్రీవ ఆలయం ఉంది. ప్రతినిత్యం చదువుకునే ఈ లలితా సహస్రనామాలు కూడా హయగ్రీవుని ద్వారానే వచ్చాయి. హయగ్రీవుడు చదువులకు అధిదైవం. మన శాస్త్రాలు అంటే ఎంతో కాలంగా ఆచరించి పొందిన అనుభవాల సారాలు. అందుకే "ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః" చాలా కాలంగా చేసిన ఆచారములే ధర్మములు, అవి మనల్ని రక్షించేవి కనుక వాటిని చెప్పేవి శాస్త్రాలు అయ్యాయి. శాస్త్రాలను బట్టి ఆచారాలు సంప్రదాయాలు ఏర్పడ్డాయి. జ్ఞానం, విద్య, సద్య స్ఫురణ, సృజనాత్మకత కావాలనుకునే వారు హయగ్రీవుని ఆరాధించాలి. హయగ్రీవ జయంతిని శుభప్రదంగా భావించి, అక్షరాభ్యాసం కూడా చేసుకుంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494